





Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 84 | శుక్రవారం 22 ఆగస్టు 2025 | పేజీలు : 9 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## రష్యా నుంచి చమురు

- అమెరికాకు జైశంకర్ ఘాటు కౌంటర్
- రష్యా చమురు కొనుగోళ్లపై పశ్చిమ దేశాలకు జైశంకర్ గట్టి సమాధానం
- మాకంటే చైనా, యూరోపియన్ యూనియన్‌లే అతిపెద్ద కొనుగోలుదారులు
- 2022 తర్వాత రష్యాతో వాణిజ్యం పెంచుకున్నది మేము కాదు
- ఒకప్పుడు ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించమన్నది అమెరికాయే
- అమెరికా వాదనలోని తర్కం అర్థం కావడం లేదన్న జైశంకర్

- మిగతా 2లో..

### రాహుల్ గాంధీ డ్రైవర్ పై

## ఎఫ్ఐఆర్ నమోదు...

- కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం
- బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర'లో అపశ్రుతి
- కాన్వాయ్ వాహనం తగిలి పోలీసు కానిస్టేబుల్‌కు గాయాలు
- ఈ ఘటనపై రాహుల్‌ను విమర్శించిన బీజేపీ నేత షెహజాద్ పూనావాలా
- గాయపడిన కానిస్టేబుల్‌కు రాహుల్ గాంధీ పరామర్శ



న్యూఢిల్లీ– సూర్య వాస్తవం, ఆగస్టు 21

బీహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఆయన కాన్వాయ్‌లోని వాహనం తగిలి ఓ పోలీసు కానిస్టేబుల్ గాయపడగా,


- మిగతా 2లో..

### వాడీవేడి చర్చలు, నిరసనల మధ్య

## ముగిసిన పార్లమెంటు సమావేశాలు

- 120 గంటలు జరగాల్సిన సభ కేవలం 37 గంటలు మాత్రమే జరిగిన సమావేశాలు
- అనేక బిల్లులకు ఆమోదం

న్యూఢిల్లీ– సూర్య వాస్తవం, ఆగస్టు 21



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడీవేడి వాగ్వాదాలు, అనూహ్య పరిణామాల మధ్య గురువారంతో ముగిశాయి. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ ఆకస్మిక రాజీనామా, 'ఆపరేషన్ సిందూర్' పై ప్రధాని నరేంద్ర మోదీ–కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం వంటి కీలక పరిణామాలతో సభ దద్దరిల్లింది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)'కు వ్యతిరేకంగా విపక్షాల ఆందోళనలతో సమావేశాలు చివరి వరకు గందరగోళంగానే సాగాయి. ఈ సమావేశాల్లో చోటుచేసుకున్న

- మిగతా 2లో..

### ఎస్సీ వర్గీకరణ ముసాయిదా

## ఆర్డినెన్స్‌కు ఏపీ కేబినెట్ ఆమోదం

- ముగిసిన సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశం
- మొత్తం 33 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర
- అమరావతిలో మౌలిక వసతులకు రూ.904 కోట్లు కేటాయింపు
- కొత్త అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణానికి పరిపాలన అనుమతులు

అమరావతి– సూర్య వాస్తవం, ఆగస్టు 21

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన



జరిగిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మొత్తం 33 అజెండా అంశాలపై చర్చించి, వాటన్నిటికీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతిలో మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయించారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం

- మిగతా 2లో..



## మైసూర్ దసరా ఎయిర్ షోకు అనుమతి

- రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం సిద్ధరామయ్య కృతజ్ఞతలు

బెంగళూరు– సూర్య వాస్తవం, ఆగస్టు 21

నాదహబ్బ మైసూర్ దసరా మహోత్సవాల సందర్భంగా ఎయిర్ షో నిర్వహించడానికి అనుమతి ఇచ్చినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కృతజ్ఞతలు తెలిపారు. మైసూర్ దసరాకు దాని స్వంత చరిత్ర ఉంది. నాదహబ్బ దసరాను చూడటానికి లక్షలాది మంది వస్తారు. భక్తి, భక్తికి నిదర్శనంగా నిలిచే మైసూర్ దసరా సందర్భంగా ఎయిర్ షోకు అనుమతి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని సీఎం సిద్ధరామయ్య

2లో



### విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి

## సుదర్శన్ రెడ్డి నామినేషన్..

- ప్రతిపాదిస్తూ సంతకం చేసిన సోనియా
- ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- ఆయన పేరును ప్రతిపాదించిన సోనియాగాంధీ సహా 20 మంది ఎంపీలు
- తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన సుదర్శన్ రెడ్డి

- మిగతా 2లో..

## ఏపీ సముద్ర తీరానికి మహర్దశ..

- రూ.9,000 కోట్ల పెట్టుబడితో కీలక ఒప్పందం
- ఆంధ్రప్రదేశ్‌లో పోర్టుల అభివృద్ధికి కీలక ఒప్పందం
- ఏపీ మారిటైమ్ బోర్డ్, ఏపీఎం టెర్మినల్స్ మధ్య ఎంవోయూ
- రాష్ట్రంలోకి రూ.9,000 కోట్ల భారీ పెట్టుబడి
- దాదాపు 10,000 మందికి కొత్తగా ఉద్యోగ అవకాశాలు
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో టెర్మినళ్ల నిర్మాణం, ఆధునికీకరణ
- ఏపీని మారిటైమ్ గేట్‌వేగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం



అమరావతి– సూర్య వాస్తవం, ఆగస్టు 21

ఆంధ్రప్రదేశ్‌ను తూర్పు తీరానికి ప్రధాన సముద్ర వాణిజ్య ముఖద్వారంగా (మారిటైమ్ గేట్‌వే), లాజిస్టిక్స్ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాత ఏ.పీ. మోలర్–మాయర్స్క్ గ్రూప్‌లో భాగమైన ఏపీఎం టెర్మినల్స్ (ఏపీఎంటీ) సంస్థతో ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్ (ఏపీఎంబీ) ఒక కీలక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలో పోర్టులు, టెర్మినళ్ల అభివృద్ధి, ఆధునికీకరణ వేగవంతం కానుందని సీఎం చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా రాష్ట్రంలో రూ.9,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు 'ఏపీఎం టెర్మినల్స్' అంగీకరించిందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని పోర్టులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునికీకరించడంతో పాటు, ప్రపంచస్థాయి టెర్మినళ్లను

- మిగతా 2లో..




## వాతావరణం, నీటి నిర్వహణ సూచికల కోసం అవేర్ 2.0

- వర్షాలు, తుపాన్లపై 7 రోజుల ముందుగానే హెచ్చరికలు
- విపత్తు నిర్వహణలో కీలకంగా అవేర్ 2.0 వ్యవస్థ - ప్రాణ, ఆస్తి నష్టాల నివారణలో ప్రధాన భూమిక
- నదులు, జలాశయాల్లో నీటి నిల్వలపైనా నిరంతర పర్యవేక్షణ
- వ్యవసాయం, మత్స్యకారులు సహా 42 రంగాల్లో అవేర్ సేవలు
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో అవేర్-2.0 డాష్ బోర్డు తెచ్చిన ఆర్టీజీఎస్

3లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## రాహుల్ గాంధీ డ్రైవర్ పై

# ఎఫ్ఐఆర్ నమోదు...

(మొదటిపేజీ తరువాయి)

ఆ వాహన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ప్రమాదం జరిగిన వెంటనే రాహుల్ గాంధీ తన వాహనాన్ని ఆపి, గాయపడిన పోలీసుకి సహాయం చేశారు. ఈ ఘటన రాజకీయంగానూ కాక రేపింది.

వివరాల్లోకి వెళితే, నవాడా జిల్లాలోని భగత్ సింగ్ చౌక్ వద్ద రాహుల్ గాంధీ యాత్ర కొనసాగుతుండగా... ఈ క్రమంలో భద్రతా విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ అదుపుతప్పి కాన్వాయ్‌లోని వాహనం ముందు పడిపోయారు. దీంతో ఆ వాహనం ఆయన కాలిపై నుంచి వెళ్లడంతో గాయాలయ్యాయి. ఈ విషయంపై నవాడా ఎస్పీ అభినవ్ ధీమన్ స్పందిస్తూ, "డ్రైవర్‌పై కేసు నమోదు చేశాం. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తాం" అని తెలిపారు. ఈ ఘటనపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఓ వీడియోను పోస్ట్ చేస్తూ, "రాహుల్ గాంధీ కారు ఓ పోలీసును తీవ్రంగా గాయపరిచింది. కనీసం ఆగి చూడకుండా ఆయన వెళ్లిపోయారు" అని తీవ్ర విమర్శలు చేశారు. అయితే, ఆ తర్వాత వెలుగులోకి వచ్చిన మరో వీడియోలో వాస్తవ పరిస్థితి భిన్నంగా కనిపించింది. ప్రమాదం జరిగిన వెంటనే రాహుల్ గాంధీ తన వాహనాన్ని నిలిపివేశారు. కిందపడిన కానిస్టేబుల్ వద్దకు వెళ్లి, ఆయన్ను పైకి లేపి తన జీపులోకి ఎక్కించుకున్నారు. ఆయనకు మంచినీళ్లు అందించి, ఓదార్చిన తర్వాతే తన యాత్రను కొనసాగించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ వర్గాలు కౌంటర్ ఇస్తున్నాయి. ఈ ఘటన ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

# రష్యా నుంచి చమురు

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, ఆగస్టు 21**

రష్యా నుంచి భారత్ ఇంధనం కొనుగోలు చేయడంపై పశ్చిమ దేశాల నుంచి వస్తున్న విమర్శలను భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ గట్టిగా తిప్పికొట్టారు. రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్నది భారత్ కాదని, చైనా, యూరోపియన్ యూనియన్‌లే ఆ స్థానంలో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. రష్యా పర్యటనలో ఉన్న ఆయన గురువారం ఒక మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. "రష్యా నుంచి మేమేమీ అతిపెద్ద చమురు కొనుగోలుదారులం కాదు, ఆ స్థానంలో చైనా ఉంది. అలాగే, సహజ వాయువును అత్యధికంగా కొంటున్నది యూరోపియన్ యూనియన్. 2022 తర్వాత రష్యాతో వాణిజ్యాన్ని విపరీతంగా పెంచుకున్న దేశాల్లో కూడా మేము లేము" అని జైశంకర్ వివరించారు. ఈ విషయంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని ఆయన పరోక్షంగా సూచించారు.

గతంలో అమెరికా వైఖరిని గుర్తుచేస్తూ జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించేందుకు అవసరమైతే రష్యా నుంచి కూడా చమురు కొనాలని గత కొన్నేళ్లుగా చెబుతూ వచ్చింది అమెరికాయే. వాళ్ల మాట ప్రకారమే మేం నడుచుకున్నాం. యాదృచ్ఛికంగా, మేం అమెరికా నుంచి కూడా చమురు కొనుగోలు చేస్తున్నాం, ఆ పరిమాణం కూడా పెరిగింది. అలాంటప్పుడు ఇప్పుడు ఈ విమర్శల వెనుక ఉన్న తర్కం ఏమిటో మాకు అర్థం కావడం లేదు" అని ఆయన అన్నారు.

ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో రష్యాను నిలువరించేందుకే భారత ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించారని అమెరికా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మంగళవారం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో జైశంకర్ ఈ విధంగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి

# సుదర్శన్ రెడ్డి నామినేషన్..

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, ఆగస్టు 21**

దేశ ఉపరాష్ట్రపతి పదవికి జరుగుతున్న ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. తెలంగాణకు చెందిన ప్రముఖ న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి విపక్ష ఇండియా కూటమి తరఫున బరిలో నిలిచారు. ఈరోజు ఆయన తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీతో పాటు కూటమికి చెందిన 20 మంది ఎంపీలు ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ సంతకాలు చేయడం విశేషం.

జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం గ్రామం. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందిన ఆయన, న్యాయవ్యవస్థలో అంచెలంచెలుగా ఎదిగారు. 2005 నుంచి 2007 వరకు గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది, 2007 నుంచి 2011 వరకు సుమారు నాలుగున్నరేళ్ల పాటు సేవలందించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి పదవీ విరమణ చేశాక, గోవా రాష్ట్రానికి లోకాయుక్తగా కూడా ఆయన పనిచేశారు.

జగదీప్ ధన్‌ఖడ్ ఇటీవల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. అధికార ఎన్డీఏ కూటమి తమ అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ను నిలిపిన సంగతి విదితమే.

# ఏపీ సముద్ర తీరానికి మహర్దశ..

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించనున్నట్టు వివరించారు. పారిశ్రామిక ప్రగతికి, సామాజిక-ఆర్థిక అభివృద్ధికి మధ్య సమతుల్యత సాధించడం ఈ భాగస్వామ్యం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈ భారీ పెట్టుబడితో రాష్ట్రంలో సుమారు 10,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని వెల్లడించారు. పోర్టుల ప్రణాళిక, టెర్మినల్ కార్యకలాపాల్లో ఏపీఎం టెర్మినల్స్‌కు ఉన్న అంతర్జాతీయ అనుభవం, రాష్ట్రానికి ఉన్న వ్యూహాత్మక ప్రయోజనాలతో కలిసి ఆంధ్రప్రదేశ్ సముద్ర వాణిజ్య రంగంలో ఇదొక మైలురాయిగా నిలుస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఆంధ్ర ప్రదేశ్‌ను దేశ తూర్పు తీరానికి 'మారిటైమ్ గేట్‌వే'గా, 'లాజిస్టిక్స్ హబ్'గా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఒప్పందం ఆ దిశగా వేసిన ఒక బలమైన అడుగు అని ఆయన అభిప్రాయపడ్డారు.

# మైసూర్ దసరా ఎయిర్ షోకు అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. దసరా వేడుకల్లో పాల్గొనాలని రాజ్‌నాథ్ సింగ్‌ను ఆయన సాదరంగా ఆహ్వానించారు. ఈ వైమానిక ప్రదర్శన చారిత్రాత్మక ఉత్సవానికి మరింత వైభవాన్ని జోడించడమే కాకుండా, దసరా చూడటానికి వచ్చే లక్షలాది మందిలో దేశభక్తిని నింపుతుందని సిద్ధరామయ్య తన ప్రకటనలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మీరు పాల్గొనడం కంటే గొప్ప గౌరవం మరొకటి లేదు. మీ ఉనికి నాకు సాయుధ దళాల పట్ల ఉన్న గౌరవం మరియు అభిమానాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. దసరా సందర్భంగా వైమానిక ప్రదర్శన నిర్వహించడానికి అనుమతి కోరుతూ సిద్ధరామయ్య గత నెలలో రాజ్‌నాథ్ సింగ్‌ను స్వయంగా కలిశారు.

## వాడీవేడి చర్చలు, నిరసనల మధ్య

# ముగిసిన పార్లమెంటు సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమైన పరిణామాలు ఇవి

1. **ఉపరాష్ట్రపతి రాజీనామా:** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేశారు. ఇంకా రెండేళ్ల పదవీకాలం మిగిలి ఉండగానే ఆరోగ్య కారణాలను చూపుతూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆకస్మిక పరిణామం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.
2. **మోదీ-రాహుల్ మధ్య మాటల యుద్ధం:** 'ఆపరేషన్ సిందూర్' అంశంపై లోక్‌సభలో ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్‌ను గుడ్డిగా నమ్ముతోందని మోదీ విమర్శించగా, ప్రభుత్వం భారత పైలట్ల సామర్థ్యాన్ని తక్కువ చేసిందని, కేవలం మోదీ ప్రతిష్ఠను కాపాడేందుకే ఈ ఆపరేషన్ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు.
3. **ఎస్ఐఆర్ పై విపక్షాల ఆందోళన:** బీహార్ ఎన్నికల ముందు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఇండియా కూటమి పార్లమెంటు లోపల, బయట పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. 'ఓట్ల దొంగతనాన్ని ఆపండి' (స్టాప్ వోట్ చోరీ) అంటూ బ్యానర్లు ప్రదర్శిస్తూ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేసింది.
4. **కీలక బిల్లులకు ఆమోదం:** ఈ సమావేశాల్లో రాజ్యసభ 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్లు 2025'కి ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ఆన్‌లైన్‌లో డబ్బుతో ఆడే ఆటలను, వాటి ప్రకటనలను నిషేధి స్తుంది. మరోవైపు, తీవ్రమైన నేరారోపణలపై 30 రోజులు నిర్బంధంలో ఉన్న ప్రధానులు, ముఖ్యమంత్రులు, మంత్రులు రాజీనామా చేయాలని నిర్దేశిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఓ కీలక బిల్లును ప్రవేశపెట్టారు.
5. **ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో దక్షిణాది పోరు:** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటములు రెండూ దక్షిణాది రాష్ట్రాల అభ్యర్థులనే బరిలోకి దింపాయి. ఎన్డీఏ తరఫున తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి తరఫున తెలంగాణకు చెందిన జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి పోటీలో నిలిచారు.
6. **ఆరోపణలపై త్రిసభ్య కమిటీ:** జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన 'క్యాష్-ఎట్-హోమ్' ఆరోపణలపై విచారణకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో సుప్రీంకోర్టు జడ్జి అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, సీనియర్ అడ్వొకేట్ పీవీ ఆచార్య సభ్యులుగా ఉన్నారు.
7. **సభా పనితీరుపై స్పీకర్ అసహనం:** విపక్షాలు ప్రణాళిక ప్రకారమే సభా కార్యకలాపాలకు అడ్డంకులు సృష్టించాయని స్పీకర్ ఓం బిర్లా విమర్శించారు. మొత్తం 120 గంటలు జరగాల్సిన సభ కేవలం 37 గంటలు మాత్రమే పనిచేసిందని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సమావేశాల్లో లోక్‌సభ 12, రాజ్యసభ 14 బిల్లులను ఆమోదించాయి.

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా


# ఆర్డినెన్స్‌కు ఏపీ కేబినెట్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

రూ.904 కోట్లు కేటాయిస్తూ సీఆర్‌డీఏ చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటు, అమరావతిలో కొత్తగా అసెంబ్లీ భవనాన్ని రూ.617 కోట్లతో, హైకోర్టు భవనాన్ని రూ.786 కోట్లతో నిర్మించేందుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ నిర్ణయాలతో రాజధాని నిర్మాణ పనులు మళ్లీ వేగం పుంజుకోనున్నాయని స్పష్టమవుతోంది. వ్యవసాయ, సాగునీటి రంగాలకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేసింది. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా రూ.1000 కోట్ల రుణం సమీకరించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా, పోలవరం ఎడమ కాల్వ పనులకు రీటెండర్‌కు, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులకు కూడా ఆమోద ముద్ర వేసింది.

సామాజిక న్యాయం దిశగా మరో కీలక అడుగు వేస్తూ, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా 'ఏపీ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ 4.0'ను కూడా మంత్రివర్గం ఆమోదించింది. అనంతపురం జిల్లాను సౌర, పవన విద్యుత్ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టులకు, రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టుల కోసం భూముల కేటాయింపునకు కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది. రాష్ట్ర అధికార భాషా సంఘం పేరును మార్చే ప్రతిపాదనను కూడా మంత్రివర్గం అంగీకరించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, ఈ నిర్ణయాలు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. మంత్రులంతా ప్రజలతో మమేకమై, దూకుడుగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారని ఆయన వివరించారు.

కార్పొరేట్లకోసం రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న భూ సేకరణకు వ్యతిరేకంగా ప్రజలు కదులుతున్నప్పటికీ ప్రభుత్వ వైఖరిలో మాత్రం మార్పు రావడం లేదు. భూ పందేరానికి మరింత వీలు కల్పించేలా నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్ యాక్టు (నాలా)ను రద్దు చేసింది. ఇప్పటి వరకు వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాల కోసం మార్చుకోవడం కష్టంగా ఉన్న సంగతి తెలిసిందే. ఇలా మార్చుకోవాలనుకునే వారు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయభూమి (వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు)-2006 చట్టం (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్ యాక్టు -నాలా) ప్రకారం దరఖాస్తు చేసుకోవాల్సిఉంటుంది. ఈ దరఖాస్తును అధికారులు పరిశీలించి, వారి నుండి కొంత రుసుంను వసూలు చేసి ఆ మేరకు అనుమతులు ఇచ్చేవారు. కోర్టు వివాదాల కారణంగా ఈ ప్రక్రియ కొంత ఆలస్యం సైతం అయ్యేది. స్వర్ణాంధ్ర విజన్ 2047 లో భాగంగా కార్పొరేట్ల అవసరాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున భూసేరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. 'కార్పొరేట్లు కోరుకున్న చోట.. కోరుకున్న భూములను ఇస్తాం' అని కూడా ఈ పాలసీల్లో పేర్కొంది. అయితే, ఈ ప్రక్రియకు 'నాలా' అడ్డుగా ఉండటంతో దాన్ని రద్దు చేస్తూ మంత్రిమండలి తాజాగా నిర్ణయం తీసుకుంది. మంత్రి మండలి



నిర్ణయాలను మీడియాకు వివరించిన రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి .'ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్' 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నాలా చట్టం రద్దు కారణంగా స్థానిక సంస్థలు కోల్పోతున్న ఆదాయాన్ని భర్తీ చేసేందుకు వివిధ స్థానిక సంస్థల చట్టాల్లో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్పుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే పద్ధతిలో (యూనిఫామ్) అనుసరించే ప్రకియను రూపొందిస్తామన్నారు. దీని ద్వారా మౌలిక వసతుల ఏర్పాటుకు అవసరమైన నిధులను సేకరిస్తామని వివరించారు. ఈ విధానం పెద్ద రోడ్లు, ఫ్లై ఓవర్లు, ప్రాంతీయ పార్కులు, ఇతర నగర సౌకర్యాల అభివృద్ధికి సహాయపడుతుందని తెలిపారు.

**అదానీకి 33 ఏళ్ల లీజుకు**

అదానీకి మరోసారి మంత్రిమండలి భూములను కేటాయించింది. కడప జిల్లా మైలవరం మండలంలోని వడ్డిరాల, దొడియం గ్రామాల్లో 1200.05 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎపి సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా అదానీ సోలార్ ఎనర్జీకి 33 ఏళ్ల పాటు అద్దె ప్రాతిపదికన భూకేటాయింపులు చేసే ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. 250 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు అప్పగిస్తునట్లు మంత్రి తెలిపారు. ముందుగానే స్వాధీనం చేసుకున్న భూములను అప్పగిస్తామన్నారు. రాజధాని పరిధిలో ఉన్న ఎస్‌ఆర్‌ఎం, విట్ ప్రైవేట్ యూనివర్సిటీలకు చేరో 100 ఎకరాల చొప్పున భూమిని అదనంగా అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రాజధాని 29 గ్రామాల్లోని గ్రామ కంఠాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.904కోట్లకు ఆమోదం తెలిపామన్నారు. అధికార భాషా కమిషన్ పేరును మండలి వెంకటకృష్ణరావు అధికార భాషా కమిషన్‌గా మార్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని చెప్పారు. ఈ కమిషన్ స్థాపనలోనే వెంకట కృష్ణారావు కీలక పాత్ర పోషించారని తెలిపారు.పదవి విరమణ అనంతరం అంగన్‌వాడీ వర్కర్లకు రూ.1లక్ష, హెల్పర్లకు రూ.40వేలు గ్రాట్యుటీగా చెల్లించేందుకు జారీ చేసిన జివో 8కి ఆమోదం చెప్పామన్నారు.

**సచివాలయాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు**

గ్రామ, వార్డు సచివాలయ శాఖలో మూడెంచల విధానం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించామని చెప్పారు. సచివాలయాల నియంత్రణ, పర్యవేక్షణ కోసం గ్రామ, వార్డు సచివాలయ శాఖలో 2778 పోస్టులను డిప్యూటేషన్, ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో 11 మంది సిబ్బందిని 10 మందికి కుదించే విధానాన్ని ఆమోదించామన్నారు. విదేశీ మద్యం బ్రాండ్లకు అంచనా విలువలకు టెండర్ కమిటీ ద్వారా ప్రాథమిక ధరల నిర్ణయానికి ఆమోదం కోరే ప్రతిపాదనను ఆమోదించామన్నారు. మాన్యువల్ స్కావెంజర్స్, డ్రై లేట్రీన్లు శుభ్రం చేసే పనుల రద్దు, ఉపాధి చట్టం తీర్మానాన్ని శాసనసభ ముందు ఉంచాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వికలాంగులు, కుష్టు వ్యాధి వంటి వైకల్యం కలిగిన వ్యక్తుల పట్ల వివక్షాపూరిత పదాలు, వాక్యాలను తొలగించే బిల్లుకు ఆమోదం తెలిపామన్నారు. సిఆర్‌డిఎ 19వ సమావేశంలో సిఆర్‌డిఎ ప్రాంతంలోని వివిధ సంస్థలకు భూమి కేటాయింపులు అధికారాన్ని సిఆర్‌డిఎ కమిషనర్ చర్యలు తీసుకునే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర విధానం-2024-2029 సవరణ చేశామన్నారు. సముద్ర మరియు అనుబంధ కార్యకలాపాలకు పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి, పెట్టుబడిదారుల స్నేహపూర్వకతను మెరుగుపరచడానికి ఎపి పారిశ్రామిక అభివృద్ధి విధానం, తదితర రంగాల అభివృద్ధి విధానాలకు అనుగుణంగా ఉండేలా మౌలిక వసతులు, పెట్టుబడులు శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపామన్నారు.

**మరికొన్ని నిర్ణయాలు**

గుంటూరులో టిడిపి కార్యాలయానికి 2954 చదరపు గజాల మున్సిపల్ భూమిని ఎకరం రూ.1000ల విధానంలో 33 ఏళ్లకు అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయం. లీజును 99 ఏళ్ల వరకు పొడిగించే అవకాశం.

చిత్తూరు జిల్లా కుప్పం, నెల్లూరు జిల్లా దగదర్తిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం అభివృద్ధి కోసం పిపిపి కన్సెషనర్ సేకరణను ప్రారంభించేందుకు ఎపి విమానాశ్రయానికి ఆమోదం కోసం ముసాయి ఆర్‌ఎఫ్‌పి ఆమోదం. హడ్కో రుణం ద్వారా అభివృద్ధి.

ఎపి పర్యాటక భూమి కేటాయింపు విధానం-2024-29కు అనుబంధ చేరికలు చేసే ప్రతిపాదనకు ఆమోదం.

ఎపి సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థ పదార్థాల పునర్వినియోగ విధానం-4.0 ప్రతిపాదనకు ఆమోదం.

చిత్తూరు జిల్లాలోని 50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్.

అంతర్జాతీయ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ సాయి మైనేనికి క్రీడా విభాగంలో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చేందుకు చట్ట సవరణ.

పల్నాడు జిల్లా రాజకీయ కక్షల నేపథ్యంలో హత్యకు గురైన చంద్రయ్య కుమారుడికి జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చేందుకు చట్టసవరణ.

సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ యోగా అండ్ నేచురోపతి స్థాపన కోసం గుంటూరు జిల్లా ప్రతిపాడు మండలంలోని నడింపాలెం గ్రామంలో 12.96 ఎకరాల ప్రభుత్వ భూమి ఆయుష్ కమిషనర్‌కు కేటాయింపు.

అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌లో ఐబిఎం క్వాంటం కంప్యూటర్ ఇన్‌స్టాలేషన్‌కు ఆమోదం.

# అమాత్య... ఆశలేనా

**విజయవాడ – సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీలోని పలువురు నేతలు అసంతృప్తితో ఉన్నారు. మాజీ అధ్యక్షురాలు పురంద్రీశ్వరి దగ్గర నుంచి అనేక మంది తమకు పదవులు దక్కలేదన్న అసహనంతో ఉన్నారు. పార్టీలో కీలకంగా ఉన్న తమకు పదవులు దక్కక పోవడంతో పాటు పార్టీలో పేరు విని పించని నేతలకే ప్రాధాన్యత దక్కుతుందని భావిస్తున్నారు. అందులో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఒకరు. సుజనా చౌదరి రాష్ట్ర రాజకీయాలంటే ఆయనకు పొసగదు. ఆయనకు కేంద్ర రాజకీయాలంటేనే ప్రీతి. అందుకే రెండుసార్లు రాజ్యసభకు అడిగి మరీ ఎంపిక చేయించుకున్నారు. ఒకసారి కేంద్ర మంత్రి పదవిని కూడా చేపట్టారు. 2024 ఎన్నికలకు వచ్చేసరికి సుజనా చౌదరికి ఎంపీ టిక్కెట్ దక్కలేదు. వాస్తవానికి విజయవాడ పార్లమెంటు టిక్కెట్ ఆశించారు. కానీ పొత్తులో భాగంగా ఆయనకు సీటు దక్కలేదు. తన కొలీగ్ సీఎం రమేష్ కు మాత్రం అనకాపల్లి ఎంపీ సీటు దక్కింది. సుజనా చౌదరి అయిష్టంగానే ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఆయన తనకు బీజేపీ కోటాలో మంత్రి పదవి దక్కుతుందని గట్టిగా భావించారు. తాను సీనియర్ నేత కావడంతో పాటు అనేక అంశాల్లో టీడీపీతో తనకున్న సంబంధాలు కూడా మంత్రి పదవిని తెచ్చిపెడతాయని ఆయన ఆశించారు. కానీ కేంద్ర నాయకత్వం ఆలోచన వేరే విధంగా ఆచరణలోకి పెట్టడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సత్యకుమార్ యాదవ్ కు మంత్రి పదవి దీంతో ఆయన పార్టీలో పెద్దగా యాక్టివ్ గా లేరు. సామాజికవర్గం కోణంలో తనకు భవిష్యత్ లోనూ, అంటే ఈ ఐదేళ్లలో మంత్రి పదవి చంద్రబాబు నాయుడు కేబినెట్ లో దక్కే అవకాశం లేదని ఆయనకు అర్థమయింది. దీంతో ఆయన తన పశ్చిమ నియోజకవర్గానికి మాత్రమే పరిమితమయ్యారు. సుజనా చౌదరి కేంద్రమంత్రిగా పనిచేసి కేవలం శాసనసభ్యుడిగా మిగిలిపోవడంతో ఆయన అనుచరులు కూడా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నటప్పటికీ విపక్షాలపై విమర్శల విషయంలో ఆయన పెద్దగా ఆసక్తి చూపకపోవడం కారణమిదేనని అంటున్నారు. చంద్రబాబు కేబినెట్ లో ఇప్పటికే నలుగురు కమ్మ సామాజికవర్గానికి చెందిన మంత్రులు ఉండటంతో మరొకరికి ఛాన్స్ ఇచ్చేందుకు ఇటు టీడీపీ, అటు బీజేపీ ఆసక్తి చూపదన్న అంచనాలతో ఆయన అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని అంటున్నారు.

# ఇస్రో జంబో రాకెట్ ప్రయోగం

**నెల్లూరు – సూర్య వాస్తవం**




ఇస్రో భారీ టార్గెట్‌నే ఎంచుకుంది. ఇప్పటికే ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసేలా చేసిన ఇస్రో శాస్త్ర వేత్తలు.. ఇప్పుడు జంబో రాకెట్ ప్రయోగానికి రెడీ అవుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 40 అంతస్తుల పొడవైన ప్రాజెక్ట్‌కు ప్రణాళికలు రెడీ చేస్తున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో మరో ఘనత సాధించేందుకు రెడీ అయింది. ఈసారి ఏకంగా 40 అంతస్తుల పొడవైన రాకెట్ ద్వారా 75 టన్నుల ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తోంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ఈ విషయం వెల్లడించారు. 35 కిలోల పేలోడ్‌తో మొదలు పెట్టిన భారతీయ అంతరిక్ష ప్రయాణం.. ఇప్పుడు 75,000 కిలోల బరువైన ఉపగ్రహాలను లో ఎర్త్ ఆర్బిట్ లోకి తీసుకెళ్లగలిగే ఒక మెగా రాకెట్‌ను తయారు చేసే స్థాయికి ఎదిగిందన్నారు.అంతరిక్ష ప్రయోగాల్లో ఇది ఒక 'గేమ్–ఛేంజర్'గా మారబోతుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అగ్రగామిగా ఉన్న అమెరికా, రష్యా, చైనా వంటి దేశాలు కూడా ఇలాంటి సూపర్–హెవీ లాంచ్ వెహికిల్స్‌ను అభివృద్ధి చేస్తున్నాయి. ఈ జాబితాలో భారత్ చేరడం ద్వారా.. అంతర్జాతీయ అంతరిక్ష యానంలో మన స్థానం మరింత పదిలం అవుతుంది. వాణిజ్య ఉపగ్రహ ప్రయోగ మార్కెట్‌లో మన దేశ వాటా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్‌కు కక్ష్యలో55 ఉపగ్రహాలు ఉన్నాయి. వచ్చే మూడు లేదా నాలుగేళ్లలో వీటి సంఖ్య మూడు లేదా నాలుగు రెట్లు పెరగనుందున్నారు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో కూడిన ప్రయోగాలకు ఇస్రో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. చంద్రయాన్–3, మంగళ్‌యాన్ వంటి మిషన్ల విజయాలు మనకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు తెచ్చిపెట్టాయి.ఈ మెగా రాకెట్ కేవలం అంతరిక్ష పరిశోధనలకు మాత్రమే పరిమితం కాదు. దీనికి వ్యూహాత్మక ప్రాముఖ్యత కూడా ఉంది. దీని ద్వారా రక్షణ రంగానికి అవసరమైన భారీ కమ్యూనికేషన్, నిఘా ఉపగ్రహాలను సులభంగా అంతరిక్షంలోకి పంపవచ్చు. ముఖ్యంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో దేశ రక్షణ సన్నద్ధతను ఇది మరింత బలోపేతం చేస్తుంది. భవిష్యత్తులో దేశ భద్రతకు, ఆర్థిక ప్రగతికి అంతరిక్ష సామర్థ్యం ఒక కీలకమైన అంశంగా మారనుంది. మరోవైపు ఇస్రో ఈ ఏడాది డిసెంబర్‌లో తన గగన్‌యాన్–1 టెస్ట్ మిషన్ ప్రయోగానికి కూడా సిద్ధమవుతోంది. ఇటీవలే యాక్సియమ్–4 మిషన్ ద్వారా తన అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని వచ్చిన శుభాంశు శుక్లా అనుభవం ఈ భారత తొలి మానవసహిత అంతరిక్ష మిషన్?కు కీలకం కానుంది.

# 'అధిక వడ్డీ ' పై డీఎస్పీ కొరడా...!

- అక్రమ వడ్డీ వ్యాపారస్తుడికి జిల్లా బహిష్కరణ
- అధిక వడ్డీ, హింసాత్మక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు
- బాధితులు నేరుగా పోలీసుల రక్షణ కోరవచ్చు
- డీఎస్పీ హేమంత్ కుమార్

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, ఆగస్టు 21:** సామాన్యుల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీతో వారి నడ్డి విరుస్తున్న అధిక వడ్డీ గళ్ళ పై ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ కొరడా ఝుళిపించారు. ధర్మవరం పట్టణంలో అక్రమ వడ్డీ వ్యాపారం, హింసాత్మక వసూళ్ల కేసులో ప్రధాన నిందితుడు సాకే రాజశేఖర్, అలియాస్ ఏరికల రాజా.. అలియాస్ యర్రగుంట్ల రాజా ను పోలీసులు అరెస్టు చేశారు. అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తూ, వడ్డీ చెల్లించని వారిని తన గుంపుతో కలిసి బెదిరించడం. దాడులు చేయించడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటి హింసాత్మక కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. చేనేత కుటుంబంపై దాడి చేసిన కేసులో రాజాతో పాటు అతని గ్యాంగ్ మొత్తాన్ని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. అక్రమ వడ్డీ వ్యాపారం, దాడులు, బెదిరింపులు, హింసాత్మక ఘటనలకి పాల్పడే వారి పైన కఠిన చర్యలు తీసుకొని. రౌడీ షీట్స్ ఓపెన్ చేస్తామని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ తెలిపారు. నేర తీవ్రతను బట్టి పీడీ యాక్ట్, జిల్లా బహిష్కరణ కూడా చట్ట పరంగా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ తరహాలో అక్రమ వడ్డీ వ్యాపారము, వేధింపులు, దౌర్జన్యాలు ఎదుర్కొన్న ఎవరైనా బాధితులు భయపడకుండా నిరభ్యంతరంగా ధర్మవరం వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీసులకు సమాచారం తోపాటు



ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేరును గోప్యంగా ఉంచుతూ, పూర్తి రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. పోలీసులు ప్రజల రక్షణ కోసం ఉన్నారని తెలిపారు. భయపడకుండా సంకోచించకుండా సహాయమును కోరాలని బాధితులకు డిఎస్పి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.




## వాతావరణం, నీటి నిర్వహణ

# సూచికల కోసం అవేర్ 2.0

- వర్షాలు, తుపాన్లపై 7 రోజుల ముందుగానే హెచ్చరికలు
- విపత్తు నిర్వహణలో కీలకంగా అవేర్ 2.0 వ్యవస్థ
- ప్రాణ, ఆస్తి నష్టాల నివారణలో ప్రధాన భూమిక
- నదులు, జలాశయాల్లో నీటి నిల్వలపైనా నిరంతర పర్యవేక్షణ
- వ్యవసాయం, మత్స్యకారులు సహా 42 రంగాల్లో అవేర్ సేవలు
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో అవేర్-2.0 డాష్ బోర్డు తెచ్చిన ఆర్టీజీఎస్

**అమరావతి– సూర్య వాస్తవం, ఆగస్టు 21:** వాతావరణ ముందస్తు అంచనాలు, విపత్తు నిర్వహణ, నదులు, జలాశయాల్లో నీటి నిల్వలపై పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తోంది. అవేర్ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని వివిధ అంశాల్లో ముందస్తు సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వం మరిన్ని రంగాలను కూడా ఈ వ్యవస్థకిందకు తీసుకువస్తూ నిర్ణయం తీసుకుంది. వాతావరణంతో పాటు రాష్ట్రంలోని నదులు, జలాశయాల్లో నీటి నిల్వలు, సాయిల్ మాయిశ్చర్, గాలి నాణ్యత, కాలుష్యం, భూగర్భ జలాలు ఇలా వేర్వేరు అంశాలను పర్యవేక్షించేలా, ప్రజలకు వేగంగా సమాచారాన్ని అందించేలా అవేర్ 2.0ను రూపొందించింది. భారీ వర్షాలు, పిడుగులు, తుపాన్లు, తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు లాంటి వాతావరణ అంశాలపై ముందస్తు సమాచారాన్ని సేకరించి అప్రమత్తం చేయటం ద్వారా ప్రజల ప్రాణాలను, ఆస్తిని కాపాడేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఏపీ వెదర్ ఫోర్ కాస్టింగ్ అండ్ ఎర్లీ వార్నింగ్ రీసెర్చ్ సెంటర్–అవేర్ 2.0 వ్యవస్థను ఆర్టీజీఎస్ ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వర్షాలు, వరదలు, పిడుగులు, గాలివానలు, జలాశయాల నీటి స్థాయిలు, నదుల ప్రవాహాలపై ముందస్తు అంచనాలు ఇచ్చి విపత్తు నిర్వహణలో కీలక సమాచారాన్ని ముందుగానే అందుబాటులోకి రానుంది. వాతావరణంలో వచ్చే మార్పులను 7 రోజుల ముందుగానే అవేర్–2.0 వ్యవస్థ పసిగట్టి హెచ్చరికలు జారీ చేయనుంది. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై ప్రజల ప్రాణాల్ని, ఆస్తుల్ని, మూగజీవాలను కాపాడేందుకు ఆస్కారం ఏర్పడింది. అవేర్ 2.0 తో ప్రకృతి విపత్తుల వల్ల కలిగే ప్రాణ, ఆస్తి నష్టాలను చాలా వరకు తగ్గించే అవకాశం కలుగుతుందని ఆర్టీజీఎస్ చెబుతోంది. కొత్త వ్యవస్థతో పూర్తిగా మరణాలను నివారించేందుకు ఆస్కారం ఏర్పడిందని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

### రైతులకు, మత్స్యకారులకు మేలు జరిగేలా

అవేర్ 2.0 ద్వారా వారం రోజుల ముందుగానే వర్షపాతం, గాలి వేగం, మెరుపులు, పిడుగుపాటుపై ఖచ్చితమైన అంచనాలు లభిస్తున్నాయని ఆర్టీజీఎస్ వెల్లడించింది. ఈ సమాచారం ఆధారంగా రైతులు పంటల నిర్వహణ, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా ముందస్తుగా హెచ్చరికలు జారీ చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. తుపాన్లకు సంబంధించి ముందస్తు సమాచారం లేకపోవటంతో మత్స్యకారులు సముద్రంలో చిక్కుకుంటున్న పరిస్థితులు నెలకొంటున్నాయని ఈ కారణంగా వారి విలువైన ప్రాణాలు కోల్పోవటం లేదా పొరుగుదేశాల సరిహద్దుల్లోకి వెళ్తున్న ఘటనలు నమోదు అవుతున్నట్టు ఆర్టీజీఎస్ తెలిపింది. ప్రస్తుతం అవేర్ %–%2.0 వ్యవస్థతో సముద్రంలో జరిగే ప్రమాదాలను నివారించవచ్చని స్పష్టం చేసింది. మరోవైపు రాష్ట్రంలోని 109 జలాశయాలు, కృష్ణా%–%గోదావరి వంటి ప్రధాన నదులపై రియల్ టైమ్ మానిటరింగ్ ను కూడా చేస్తున్నట్టు ఆర్టీజీఎస్ తెలిపింది. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, ప్రవాహాలపై కూడా అవేర్ తో తక్షణం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

### ముందస్తు చర్యలతో ప్రజల రక్షణ

ప్రకాశం బ్యారేజ్, పోలవరం, శ్రీశైలం వంటి కీలక ప్రాజెక్టులు, నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ప్రవాహాల అంచనాలను ముందస్తుగానే తెలుసుకుని ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆవేర్ ఆస్కారం కల్పించనుంది. ఈ వ్యవస్థ ద్వారా వ్యవసాయం, మత్స్యకారులు, రవాణా, విద్యుత్, జలవనరులు వంటి 42 విభాగాలకు సేవలు అందనున్నాయి. అలాగే వ్యవసాయానికి సంబంధించి భూగర్భజలాల లభ్యతతో పాటు మండల, జిల్లాల వారీగా పంటలకు వచ్చే తెగుళ్ళ లాంటి అంశాల్లోనూ హెచ్చరికలు జారీ చేసేందుకు అవేర్ వ్యవస్థ ఉపయోగపడనుంది. మరోవైపు సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు కూడా ఏ ప్రాంతాల్లో చేపలు ఎక్కువగా లభ్యం అవుతాయన్న అంశాన్ని కూడా ఉపగ్రహ ఛాయాచిత్రాల ఆధారంగా అవేర్ అందిస్తుందని ఆర్టీజీఎస్ స్పష్టం చేసింది. ఈ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం ఓ డ్యాష్ బోర్డును ఏర్పాటు చేసింది. %ఖుఖుతీవ.ఖుజా.స్త్రశీజ.అఅ% వెబ్ సైట్ లో వాతావరణ సూచనలు, జలాశయాల స్థితి, నదుల ప్రవాహాలపై లైవ్ డేటా చూసేందుకు ఆస్కారం ఏర్పడనుందని ఆర్టీజీఎస్ స్పష్టం చేసింది.

# దాసరి మునెయ్యకు తెలుగు తేజం పురస్కారం



పుత్తూరు–సూర్యవాస్తవం, ఆగస్టు 21

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా ఉద్యమ పితామహులు గిడుగు రామమూర్తి పంతులు జన్మదినం సందర్భంగా అంతర్జాతీయ సాహిత్య,సాంస్కృతిక సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 31న పలనాడు జిల్లా నరసారావు పేటలో తెలుగు భాషా దినోత్సవాన్ని రాష్ట్రస్థాయిలో ఘనంగా నిర్వహిస్తారు. ఈకార్యక్రమంలో తెలుగు భాష కోసం కృషి చేసిన ప్రముఖ రచయిత,తెలుగు ఉపాధ్యాయులు, సమాజకవి దాసరి మునెయ్య ను తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు సాహిత్య పిపాసి 36 ప్రపంచ రికార్డులతో సాహిత్య సేవ చేస్తున్న కత్తిమండ ప్రతాప్ గారు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పురస్కార ప్రదానోత్సవం శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి ఈశ్వరిభూషణం గారి పర్యవేక్షణలో సన్మాన గ్రహీత దాసరి మునెయ్య కు అవార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తెలుగు పాఠ్యపుస్తకాలు రచయితగా సమాజ చైతన్యం కోసం తన కవిత్వం ద్వారా , నిరంతరం తన రచనల ద్వారా ఎంతో మందికి స్ఫూర్తినిస్తున్నటువంటి యువ కవికి ఈ అరుదైన పురస్కారం లభించింది అని తెలిపారు ఈ సందర్భంగా దాసరి మునెయ్య మాట్లాడుతూ తన సాహిత్యానికి గుర్తింపు ఇచ్చిన శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు కత్తి మండ ప్రతాప్‌కి మరియు ఎంపిక చేసిన శ్రీశ్రీ కళావేదిక కు కృతజ్ఞతలు తెలియజేశారు. దాసరి మునెయ్య కు అవార్డు రావడం పట్ల తాను పని చేస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు నారాయణ వనం ప్రధానోపాధ్యాయులు శ్రీమతి సులోచన గారు, ఉపాధ్యాయులు, మరియు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యస్ యస్ నాయుడు, నాయకులు చెంగల్రాజు, ముని కుమార్, రమేష్, గంగాధరం, లక్ష్మీ ప్రసాద్,మునిరత్నం, కోటి, కవిత, దేవి, భారతి, జయప్రధ, అల్లెమ్మ తదితరులు అభినందనలు తెలిపారు.

# అర్హులైన దివ్యాంగులకు అన్యాయం చేయొద్దు

- 50 ఏళ్లకే పెన్షన్ హామీని అమలు చేయాలి
- సెంట్రలైజ్డ్ కిచెన్లపై పునరాలోచించాలి
- వృద్ధులపై చిన్న చూపు వద్దు
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం, ఆగస్టు 21:** రాష్ట్రంలో అక్కడక్కడ అర్హులైన దివ్యాంగుల పింఛన్ దారులకు పింఛన్లు కట్ అయినట్టు ఇటీవల వార్తలు వస్తున్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో 7 లక్షల 86 వేల మంది దివ్యాంగ పింఛన్లు పొందుతూ ఉన్నారు. వాళ్ళల్లో నాలుగు లక్షల 50వేల మందిని ఇటీవల స్క్రూటినీ చేయడం జరిగింది. ఇందులో లక్ష మంది అనర్హులుగా తేలారని రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. ఒక కడప జిల్లాలోనే 9408 మంది ,ఒక పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలోనే 1708 మంది ఇప్పటివరకు దివ్యాంగుల పెన్షన్లు పొందుతూ ఉన్న వారిలో అనర్హులుగా చేసినట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో అక్కడక్కడ కొంతమంది నిజమైన అర్హులు కూడా అనర్హులుగా నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి .ప్రభుత్వం మళ్లీ రీ అసెస్మెంట్ చేయాలి.రీ అసెస్మెంట్ నిష్పాక్షికంగా చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో అర్హులైన దివ్యాంగులకు అన్యాయం చేయవద్దని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ ,ఎస్టీ ,బీసీ ,ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని కూటమి తన ఎన్నికల మేనిఫెస్టో లోపేర్కొనడమే కాకుండా సూపర్ సిక్స్ హామీలలోకూడా పేర్కొనడం జరిగింది. కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తి అయినప్పటికీ ఇంతవరకు ఈ హామీ అమలు కాలేదు. దాని ప్రస్తావనే లేదు .రాష్ట్రంలో ఈ హామీ కింద దాదాపు 17 లక్షల మంది ఉన్నారు .అంటే 50ు 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ, బిసి ముస్లిం మైనార్టీలు దాదాపు 17 లక్షల మంది ఉన్నారు .

-నెలకు 4000 రూపాయలు చొప్పున 14 నెలలకు గాను 56000 వాళ్ళు కోల్పోవడం జరిగింది ఈ 14 నెలలలో.దాదాపు ఏడాదికి 8160 కోట్ల రూపాయలు కావాల్సి వస్తుంది. 2024 -25 సంవత్సరానికి ఈ హామీని అమలు చేయలేదు. 2025 -26 :లో కూడా ఇంతవరకు అమలు చేయలేదు .కనీసం వచ్చే సెప్టెంబర్ మాసం నుండి అయినా సరే ఈ హామీని అంటే ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ హామీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తా ఉంది అని తులసి రెడ్డి అన్నారు.

**సెంట్రలైజుడు కిచెన్లు.**

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద ప్రస్తుతం ఉన్న విధానాన్ని రద్దుచేసి మండలానికి ఒక సెంట్రలైజుడు కిచెన్ ఏర్పాటు చేసి ,అక్కడనే భోజనం తయారు చేసి ,అక్కడినుండి మండలంలోని పాఠశాలన్నింటికీ సప్లై చేయాలి అనే ఆలోచన ప్రభుత్వం చేస్తా ఉంది .కొన్నిచోట్ల కిచెన్ షెడ్లు కూడా ఏర్పాటు అవుతున్నాయి .దీనివలన రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల కుటుంబాలు ఉపాధి కోల్పోతాయి. కొత్త ఉపాధి కల్పించాల్సింది పోయి ఉన్న ఉపాధిని తీసివేయడం అన్యాయం. అనేక సంవత్సరాలుగా కొన్ని కుటుంబాలు ఈ మధ్యాన భోజనం పథకం మీద ఆధారపడి జీవిస్తున్నాయి .ఒక్కసారి ఉపాధి కోల్పోతే ఆ కుటుంబాలు రోడ్డున పడతాయి. కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి అని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేస్తా ఉంది.

**జాతీయ వృద్ధుల దినోత్సవం**

ఈ రోజు జాతీయ వృద్ధుల దినం. జననం ,బాల్యం, కౌమారం, యవ్వనం ,వార్ధక్యం ,మరణం ఇవి ప్రకృతి ధర్మాలు ,సృష్టి ధర్మాలు .నిన్నటి యువతే నేటి వృద్ధులు. నేటి యువతే రేపటి వృద్ధులు .ఈ వాస్తవాన్ని సమాజం గుర్తించాలి. కాబట్టి వృద్ధులను, వృద్ధాప్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు .వృద్ధులను చిన్నచూపు చూడవద్దు .వాళ్ళ యొక్క అనుభవాన్ని ,వాళ్ళ యొక్క విజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగించుకునే విధంగా అటు ప్రభుత్వాలు ఇటు యువత కృషి చేయాలి.

# రద్దు చేసిన పెన్షన్లను వెంటనే పునరుద్ధరించాలి

- గుంతకల్ నియోజకవర్గంలో 1661 పెన్షన్లను తినేసిన కూటమి ప్రభుత్వం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందచేయాలని కోరుతూ ఆర్డీఓకి వినతి పత్రం సమర్పించిన నైరుతి రెడ్డి, వైసీపీ నాయకులు

**పామిడి- సూర్య వాస్తవం, ఆగస్టు 21 :** గుంతకల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై. వెంకటరామరెడ్డి ఆదేశాలనుసారంగుంతకల్ పట్టణం ఆర్ డీవో ఆఫీసు లో వినతి పత్రం అందించిన జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి,వైఎస్ఆర్సీపీ నాయకులు,ఈ సందర్భంగా నైరుతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులకు అందజేస్తున్న టువంటి పింఛన్లను కూటమి ప్రభుత్వం వివిధ కారణాల ద్వారా రద్దు చేయడం. అందులో భాగంగా గుంతకల్ నియోజకవర్గంలో 1661 పెన్షన్లను తీసివేయడం జరిగింది. రద్దు చేసిన పెన్షన్లను వెంటనే పునరు ద్ధరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అంద చేయాలని కోరుతూ ఆర్డీఓకి వినతి పత్రం సమర్పించడం జరిగింది .అంగవైకల్యంతో దివ్యాంగులుగా ఉంటూ ప్రభుత్వం నుండి పింఛన్ రూపంలో గత 10, 15 సంవత్సరాలుగా తీసుకుంటూ వస్తున్న వారి మీద కూటమి ప్రభుత్వం నిర్దాక్షి ణ్యంగా నిలిపివేయడం దారుణమణి, వారి జీవన విధానం మీద ఇది ఎంతో చేటు చేస్తుందని, ప్రభుత్వం గుర్తు చేసుకోవాలి అని అన్నారు, పెన్షన్లను పునరుద్ధరించేంతవరకు, నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నామని నైరుతి రెడ్డి తెలియజేశారు, ఈ కార్యక్రమంలో పట్టణ మండల కన్వీనర్లు ఖలీల్ రాము వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు,విద్యార్థి విభాగ నాయకులు వంశీ , వైఎస్సార్సీపీ నాయకులు జింకల రామాంజనేయులు, వార్డు ఇన్చార్జులు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్ఆర్సీపీ అనుబంధ విభాగాల,పట్టణ నాయకులు,కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.





# గణేష్ వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా చూడాలి

- అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి
- పల్లెనిద్ర కార్యక్రమాలలో ఆయా పోలీసుల పిలుపు
- గ్రామాల్లోని తాజా సమస్యలపై దృష్టి... పరిష్కారానికి కృషి



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 21:** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ఆయా సమస్యాత్మక గ్రామాలు, కాలనీలలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో మాట్లాడి తాజా సమస్యలపై ఆరా తీశారు. సమస్యలు తీవ్రం కాకుండా ప్రారంభ దశలోనే పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా అందరూ కృషి చేయాలి. అల్లర్లు, గొడవలకు దూరంగా ఉంటూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న గణేష్ వేడుకలు ప్రశాంతంగా అందరూ సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని... ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మత్తు పదార్థాల అనర్థాలు - సైబర్ మోసాలు గురించి అవగాహన చేశారు. డిజిటల్ అరెస్టు, లోన్ యాప్ ఫ్రాడ్స్, ఏపికె ఫైల్స్ ఫ్రాడ్స్ , తదితర మోసాలు గురించి వివరించారు. డబ్బులు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మకూడదని...అపరిచితుల కాల్స్ మరియు లింకులు క్లిక్ చేయ రాదని, బ్యాంకు ఖాతాల ఓటిపిలు ఎవరికి చెప్ప కూడదని ప్రజలకు సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కలిగించారు.



# హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



**గాండ్లపెంట- సూర్య వాస్తవం, ఆగస్టు 21:** ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నివారణ సంస్థ ఆదేశంలో మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జన జాగృతి కదిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి జిల్లా మండలంలోని కటారుపల్లి గ్రామంలో కస్తూరిబాయ్ గాంధీ బాలికల పాఠశాల నందు ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి. అదేవిధంగా హెచ్.ఐ.వి ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా సమాజంలో జీవించాలని తెలియజేశారు. అదేవిధంగా కాండం యొక్క ఉపయోగాలు అదేవిధంగా టోల్ ఫ్రీ నెంబర్1097 నెంబర్ గురించి తెలుపుతూ చెడు వ్యసనాలకు డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలు చెబుతూ అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, ఓ ఆర్ డబ్ల్యు అశ్విని, పి ఈ ఆంజనేయులు నాయక్, మంజుల, ప్రిన్సిపాల్ దుర్గా, హెల్త్ సూపర్వైజర్ ఉపేంద్ర, లక్ష్మి, విజయ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# గుత్తి మున్సిపాలిటీలో సచివాలయాలను తనిఖీ చేసిన మున్సిపల్ కమీషనర్



**గుత్తి -సూర్య వాస్తవం, ఆగస్టు 21:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలో గల సచివాలయాల తనిఖీ లులో భాగంగా యస్ సి కా లనీ,2,8వ సచి వాలయములో సచి వాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసిన కమీషనర్ బి.జ బ్బార్ మియా సిబ్బందికి సూచనలుగా సచివాలయంలో ప్రతి సిబ్బంది ఉదయం,మధ్యాహ్నం, సాయంత్రం బయోమెట్రిక్ అటెం డెన్స్ తప్పనిసరిగా వేయాలన్నా రు.మూమెంట్ రిజిస్టర్,డైలీ ప్రో గ్రెస్, కార్యక్రమాల డైరీ యందు రోజువారీ కార్యకలపాల సమాచారం పొందుపరచి ప్రతి రి వ్యూ సమావేశం యందు అంద జేయాలని తెలిపారు.ప్రభుత్వ పథకాలు,సర్వేలు,ట్యాక్స్ వసూలు ప్రక్రియలు నెలవారీ నిర్దేశిత,వార పు నిర్దేశిత,రోజు వారీ నిర్దేశితల క్ష్యాలను పై అధికారులు నిర్ణయిం చిన సమయాల్లో పూర్తి చేసి ము న్సిపాలిటీ ప్రోగ్రెస్ ను మంచి స్థా యిలో ఉండేలా ప్రతి సచివాల య సిబ్బంది సహకారం అందిం చాలని కోరారు.ప్రజల నుండి కలె క్టర్ ఆఫీసు నుండి వచ్చే అర్జీల ప రిష్కార చర్యలు ఎప్పటికప్పుడు రీడ్రెసల్ ప్రత్యుత్తర సమాచారం అందించేలా సిబ్బంది సంబంధిత విషయపు సెక్రెటరీ ఎండార్స్మెంట్ లు తయారు చేసి గ్రీవెన్సు పూర్తి చేయాలన్నారు.ట్యాక్స్ వసూలు 2025-26 కు సంబంధించిన ల క్ష్యాలను చేరుకోటకు గాను ప్రతి సచివాలయ పరిధిలో సచివాల య సిబ్బంది వారందరూ టీముల వారిగా వార్డుల యందు పన్ను దారులకు పన్ను చెల్లింపు సమా చార అవగాహన తెలిపి సకాలం లో పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ప్రజ లకు అవగాహన తెలిపి పన్ను వ సూలు 100% వసూలు అయ్యే లా చర్యలు చేపట్టాలని కమీషన ర్ బి.జబ్బార్ మియా సచివాల య సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఓ సతీష్ కా మలాకర్,రెవెన్యూ సిబ్బంది,ము న్సిపల్ సిబ్బంది,సచివాలయ సి బ్బంది పాల్గొన్నారు.

# విశ్వమానవ శాంతి కోసమే మానవత శాంతి ర్యాలీ

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం,ఆగస్టు 21:** విశ్వ మానవ శాంతి కోసమే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేపట్టడం జరిగిందని మానవతా కేంద్ర కమిటీ సభ్యులు వై ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు.మానవత ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ప్రపంచ శాంతిలో భాగంగా గురువారం శాంతి ర్యాలీని లక్కిరెడ్డిపల్లి మానవత ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా తాహసిల్దార్ క్రాంతి కుమార్ , మండల విద్యాశాఖ అధికారి చక్రేనాయక్, ఏ ఎస్సై గోపీనాయక్, కేంద్రకమిటీ సభ్యులు సహదేవరెడ్డి, మానవత ఛైర్మెన్ బాలసు బ్రమణ్యం లు పాల్గొని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులతో మిస్ప చర్చి నుండి స్థానిక మూడు రోడ్ల కూడలి, తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వైఎస్ఆర్ సర్కిల్లో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ క్రాంతి కుమార్ మాట్లాడుతు మానవత సేవా కార్యక్రమాలలో భాగంగా నేడు విశ్వమానవ శాంతికోసం శాంతి ర్యాలీని ఏర్పాటు చేయడం శు భపరిణామన్నారు. మానవత ఆధ్వర్యంలో బాడీఫ్రీజర్లు,శాంతిరథాన్ని సమకూర్చడం, పర్యావరణాన్ని కాపాడటంలో భాగంగా మొక్కలు నాటడం,పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించడం,ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందివ్వడం వంటి ఎన్నో కార్యక్రమాలును మానవత చేపట్టడం ఈ ప్రాంత వాసులకు మంచిదన్నారు .ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కార్యదర్శి శివయ్య,మానవత సెక్రటరీ వీరనాగిరెడ్డి, రవిశంకర్,శ్రీనివాసులు, వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహనరెడ్డి, గంగయ్య,మనీషా స్కూల్ చైతన్యారెడ్డి,పలువురు మానవత సభ్యులు ,ఉపాధ్యాయులు,నలంద,మనీషా స్కూల్,ప్రభుత్వ బాలుర హైస్కూల్,వెంకటేశ్వర కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర పై వ్యాసరచన పోటీలు

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం,ఆగస్టు 21:** మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు, ఈ పోటీలలో మండలంలోని ప్రతి విద్యార్థి పాల్గొనాలనిజామియాతే ఇతేహాదుల్ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.హిందు వారి కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 31న ఆదివారం లక్కిరెడ్డిపల్లి ఉర్దూ ఉన్నత హైస్కూల్ నందు మహమ్మద్ ప్రవక్త గురించి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ వ్యాసరచన పోటీలలో హిందూ,ముస్లిం అన్ని వర్గాల వారు పాల్గొనవచ్చు అన్నారు.12 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి అర్హులన్నారు. ఈ వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండవ బహుమతిగా రూ.5 వేలు, మూడవ బహుమతిగా రూ.3 వేలు నగదును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ వ్యాసరచన పోటీలు ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహిస్తామని వారు తెలిపారు.పూర్తి వివరాలు కోసం సదరు ఫోన్ నంబర్ లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు.9550737304, 8143 880494, 9059228362.ఈ కార్యక్రమంలో జమియాతే ఇతేహదుల్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమం ప్రజా శ్రేయస్సు ప్రభుత్వానికి రెండు కళ్ళు

### - ఎమ్మెల్యే అమిలినేని



**కళ్యాణదుర్గం - సూర్య వాస్తవం, ఆగస్టు 21:** ప్రజల శ్రేయస్సుతోపాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసనసభ్యులు అమ్లినేని సురేంద్రబాబు చెప్పారు. గురువారం పట్టణంలో ఎన్జీవో హెూం నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ 6 తో పాటు ఉద్యోగుల కు ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టబడిందని చెప్పారు. గత ఎన్నికల్లో ఉద్యోగ ఉపాధ్యాయులు కూటమికి మద్దతు ఇవ్వడం మర్చిపోలేని తీపి గుర్తు అని ఆయన చెప్పారు. ఉద్యోగుల ఆశలు ఆకాంక్షలకు తాము అనుగుణంగా మసులుకుం టామన్నారు. బ్రష్టు పట్టిన గత ప్రభుత్వ విధానాలు మార్చడానికి నిధులు సమకూ ర్చుకోవడానికి సమయం పడుతుందని అంతవరకు ఓపిగ్గా ఉండాలని కోరారు. ఈ భవన నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కల మాధవను ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ కార్యదర్శి రమణ వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ రమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ , లక్ష్మీదేవి పలువురి ఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో రాజీ లేదు

### -రాష్ట్ర ఎన్జీవో అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్



**కళ్యాణదుర్గం - సూర్య వాస్తవం, ఆగస్టు 21:** రాష్ట్రంలోని 12 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల డిమాండ్ల సాధనకై ఎలాంటి ఉద్యమ కార్యక్రమాల రచన చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నామని ఆంధ్ర ప్రదేశ్ ఎంజి జీవో అధ్యక్షులు ఆలపాటి విద్యాసాగర్ ప్రకటించారు. గురువారం కళ్యాణ దుర్గం పట్టణంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల మాధవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్జీవో హెూమ్ నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే సురేంద్ర బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో 30 వేల రూపాయలు కోట్ల రూపాయలు అరియర్స్ రూపంలో అరియర్స్ రూపంలో ఉద్యోగులకు రావాల్సిందని వాటిని ఈ ప్రభుత్వంలో సాధించేందుకు, విడతల వారీగావిడుదలకు ప్రభుత్వంతో చర్చలు జరుపుతు న్నామన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 9000 కోట్ల రూపాయలు జిపిఎఫ, ఎపిజిఎల్ఐ చెల్లింపులు జరిగాయని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగులను 7వేల మందిని రెగ్యులర్ చేయాల్సిందని చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రశ్నించే వారిపై ఉక్కు పాదం మోపారని 600 కేసులను ఉపసంహరించడంలో ఎన్జీవో సంఘం విజయం సాధించిందని చెప్పారు. పిఆర్సి పై ప్రభుత్వం త్వరలో ప్రకటన చేయనుందని ఆయన వెల్లడించారు .దసరా కనుక ప్రభుత్వం ఒక డి. ఏ ప్రకటించనుందని చెప్పారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎన్జీవో సంఘం చూసుకుంటుందని భరోసా ఇచ్చారు ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు ఆయనకు పలు విజ్ఞాపనలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ కార్యదర్శి పాతిరెడ్డి, అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి కార్యదర్శి చంద్రమోహన్ కళ్యాణ్ దుర్గం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు చెన్నారెడ్డి కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

## ధనుర్వాత వ్యాధి నివారణకు తేటన్స్ వ్యాక్షన్ తప్పనిసరి

**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం ,ఆగస్టు 21:** ధనుర్వాత వ్యాధి నివారణకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్ పేర్కొన్నారు. గురువారం ఏపీ మోడల్ స్కూల్లో ధనుర్వాత నివారణకు టెటనస్ యాక్షన్ విద్యార్థులకు వేయించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎమ్ రెడ్డమ్మ మాట్లాడుతూ ఇది క్లోస్ట్రీడియం టైటానిక్ అనే బ్యాక్టీరియా వలన కలిగే తీరని వ్యాధి అని ఇది నరాలు వ్యవస్థను ప్రభావితం చేసి కండరాలు బిగుసుకుపోయి నొప్పి జ్వరం వంటి లక్షణాలు దారితీస్తుందన్నారు కాబట్టి తప్పకుండా పిల్లలు ఈ వ్యాక్షను వేయించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకులు శివశంకర్ రెడ్డి ఆశ వర్కర్లు విద్యార్థులు పాల్గొన్నారు .



# రెవెన్యూ అంశాలపై అధికారులకు శిక్షణ

- ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి
- ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషించాలి
- రెవెన్యూ అధికారులు నిబద్ధతతో పనిచేయండి :జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 21:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన విజ్ఞప్తులు, భూముల రీ సర్వే, భూ వివాదాల పరిష్కారం, రికార్డుల అప్డేషన్ వంటి రెవెన్యూ అంశాల్లో కీలక పాత్ర పోషించి నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం మదనపల్లి పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్ నందు రెవెన్యూ పరిపాలనలో పారదర్శకత, సమయపాలన, ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పని చేయడంపై రెవెన్యూశాఖ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఏడి సర్వేయర్ భరత్ కుమార్ మదనపల్లి డివిజన్ మండల తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రజా సేవ పట్ల విధేయత, బాధ్యతల గురించి స్పష్టమైన మార్గదర్శకాలతో దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా రీ-సర్వేలో జాయింట్ ఎల్ పి ఎం తగ్గించే విధంగా చూడాలని, రీ-సర్వేలో అనవసరంగా జాయింట్ ఎల్ పి ఎం పెడితే రైతులు, భూస్వాములు ప్రభుత్వ పథకాల పొందేందుకు వారికి అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని తెలిపారు.ప్రభుత్వ భూములు కాలిబాట/ పాద దారి మార్గం, బండి దారి, నీటి వనరులు, చెరువులు, ఎలాంటి ఆక్రమణలకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



రెవిన్యూ శాఖలో కొంత మంది అధికారులు నిర్లక్ష్యం, అవినీతి కారణంగా రెవెన్యూ శాఖకు ప్రతికూలత రాకుండా ప్రతి ఒక్కరు నిజాయితీగా, బాధ్యతగా వ్యవహరించి ప్రజా సేవలో పారదర్శకత చూపాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చూపితే, ఉద్యోగ భద్రత కోల్పోవాల్సి వస్తుందని పనులు సరిగా చేయని వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింత చేరువగా ఉండి, పారదర్శకంగా పనిచేసేలా ప్రోత్సాహం లభిస్తుందని, ప్రజల సేవే రెవెన్యూ శాఖ ప్రధాన లక్ష్యం అని అధికారులు పునరుద్ఘాటించారు. పీజీ ఆర్ఎస్ ద్వారా స్వీకరించిన వినతులు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ వివాదాల దరఖాస్తులు, భూముల రీ సర్వే, రికార్డుల అప్డేషన్ , సుమోటో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఏ డి ఎస్ బి పోర్టల్, రస్తా వివాదాలు తదితర అంశాల్లో రెవిన్యూ సిబ్బంది కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి అధికారి నిజాయితీ, పారదర్శకతతో సేవలు అందించి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలను కార్యాలయాలకు పదేపదే తిప్పుకోవడం, నిర్లక్ష్యపు సమాధానాలు ఇవ్వకుండ మెరుగైన సర్వీసులు అందిస్తే రెవెన్యూ సిబ్బందికి తద్వారా జిల్లాకు, ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎవరూ ఇబ్బంది పడకుండా రెవెన్యూ సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ ఉద్యోగులందరూ ప్రజలకు జవాబుదారీతనం తో పని చేస్తూ ప్రజల వినతులను నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించాలన్నారు. సమయపాలనతో పాటు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది రెవెన్యూ అంశాల్లో మెరుగ్గా పని చేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి రెవెన్యూ అధికారి తన పనిలో బాధ్యత, క్రమశిక్షణ, నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. వివిధ రెవెన్యూ అంశాల్లో నిర్దేశించిన శిక్షణా కార్యక్రమాల ద్వారా అధికారులు తమ పనితీరును మరింత మెరుగుపరచి, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలన్నారు. రెవిన్యూ శాఖ ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తే జిల్లాకు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



అంతకుముందు రెవెన్యూ అంశాలకు సంబంధించి వివిధ రకాల సేవలను అత్యంత వేగవంతంగా అందించే విధంగా వివిధ రకాల యాప్ లను , టెక్నాలజీని వినియోగించుకుని అత్యంత నాణ్య తమైన, త్వరి తగతిన పనులు చేసి పారదర్శకమైన పాలన అందించే విధంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులకు సమగ్ర శిక్షణ ఇచ్చారు.

# సకల సృష్టికి ఆధారం శ్రీ కృష్ణుడు మాత్రమే...!

### - అనంతపురం ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణ పల్లకీ ఊరేగింపు సేవ.

**అనంతపురం - సూర్య వాస్తవం,ఆగస్టు 21:** ఈ సృష్టిలో అణువణువున వ్యాపించి, కంటికి కనిపించని శక్తి ఒకటి ఉందని, సకల జీవరాసులలో కొలువై ఉండి, ఈ సృష్టి అంతటికి మూలం శ్రీకృష్ణుడు అని ప్రబోధ సేవాసమితి అనంతపురం శాఖ అధ్యక్షుడు మల్లికార్జున, లబ్బే రాఘవ, సుంకిరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ప్రబోధ సేవాసమితి అనంతపురం శాఖ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణ పల్లకీ సేవ, ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి నేత రమేష్ గౌడ్, హెడ్ మాస్టర్ రామాంజినేయులు, దండోరా చిన్న పెద్దన్న, టిడిపి నేత టి సి నాగేంద్ర, తదితరులు హాజరయ్యారు. మొదటగా పూజా కారక్రమాలు నిర్వహించి వారు మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు బోధించిన విధంగా భగవద్గీత తోనే అన్నింటికి సమాధానాలు లభిస్తాయి అని అన్నారు.



శ్రీకృష్ణుడు మాత్రమే నిత్యం, సత్యం అని, భగవద్గీత ను అందరూ చదివి, ఆచరించాలని సూచించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా జన్మాష్టమి రోజు నుంచి ఐదు రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో స్వామి వారికి పూజలు నిర్వహించి చివరిరోజు పల్లకీ సేవ, ఊరేగింపుతో మా ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు. అనంతరం పల్లకీ సేవా కార్యక్రమం నగరంలోని పలు వీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి బీసీ సెల్ బాలాజీ, టి సి మురళీ, సత్యమయ్య, సంజీవులు, సుబ్బు, సత్యానంద, భార్గవాచారి, శ్రీనివాసులు, నాగిరెడ్డి, లక్ష్మి నారాయణ ఆచారి, రామ్మోహన్, గురు స్వామి, రామ్ రెడ్డి, గోపి, సుధా, ఇంద్ర, రాధిక, సావిత్రి, విజయ, కృష్ణవేణి, రామనీలా, చిన్నిరత్నమ్మ, ప్రసన్న, ప్రమీల, వైష్ణవి, జాహ్నవి, స్వర్ణ తోపాటు పలువురు మున్సిపల్ కార్మికులు, పెద్ద ఎత్తున భక్తాదులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ పై వైద్యులకు శిక్షణ

### - డి. ఎమ్. హెచ్. ఓ డాక్టర్ లక్ష్మీ నరసయ్య

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 21:** జిల్లా కేంద్రం లోని కే. రామపురం పట్టణ ఆరోగ్య కేంద్రం లో జిల్లా లోని పి. హెచ్. సి మరియు యూ. పి. హెచ్. సి లలో పని చేస్తున్న వైద్యులకు రెండు రోజుల శిక్షణ క్యాన్సర్ సమావేశం రెండో విడత 4.0 శిక్షణ సమావేశం నిర్వహించడం జరిగింది అని డి. ఎమ్. హెచ్. ఓ. డాక్టర్ లక్ష్మీ నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా డి. ఎమ్. హెచ్. ఓ మాట్లాడుచు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధన లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రము లోని 18సంవత్సరాల పైబడిన పౌరులందరికి కాన్సర్ (రొమ్ము, నోటి మరియు గర్భశయ ముఖాద్వార క్యాన్సర్) స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించి కేటాయించిన రిఫరల్ అస్పత్రులకు పంపించి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. ఒకవేళ



పాజిటివ్ ఐతే చికిత్స ప్రారంభించడం జరుగుతుంది అన్నారు. ఇందులో భాగంగా వైద్యులకు శిక్షణ ఇచ్చి తద్వారా పి హెచ్.సి ల లోని ఎమ్. ఎల్. హెచ్. పి, ఏ. ఎన్. ఎమ్,ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి అనంతరం ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఈ శిక్షణ వైద్యులకు రాష్ట్రము నుండి శిక్షణ పొందిన ప్రత్యేక వైద్యుల ద్వారా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎన్. సి. డి. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శివప్రతాప్, శిక్షణ ఇచ్చిన వైద్యులు డాక్టర్ నీలోఫర్, డాక్టర్ అహమద్ బాషా, డాక్టర్ రెడ్డి కీర్తి, డాక్టర్ నరేష్, డాక్టర్ జరీనా బేగం ,జిల్లా లోని వైద్యులు పాల్గొన్నారు.



# దివ్యాంగ పెన్షన్లను
# తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర

- డిజేబుల్డ్, ఆరోగ్య పెన్షన్లను తగ్గించే పనిలో చంద్రబాబు ప్రభుత్వం.
- పుట్టుకతో వైకల్యం ఉన్నా.. అర్హత ఉన్నా పెన్షన్ల కోతలకు చర్యలు చేపట్టడం శోచనీయం.
- 15 నెలల పాలనా కాలంలో ఒక్క కొత్త పెన్షన్ ఇవ్వక పోగా.. ఉన్న పెన్షన్లను తొలగొస్తుండడం ఏంటి?
- 10-15 ఏళ్లుగా పెన్షన్ తీసుకుంటున్న దివ్యాంగులు ఒక్క రోజులోనే అనర్హులా?
- కూటమి ప్రభుత్వానికి పింఛన్ పథకాలు భారమా? లేక ప్రజలేభారమా?
- కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తిన వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి





**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, ఆగస్టు 21:** దివ్యాదివ్యాంగ పెన్షన్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రగ పెన్షన్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ సి,ఎస్ టి,బిసి ,మైనారిటీ లకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ హామీని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం వస్తున్న పెన్షన్లను తొలగించే పనిలో పడిందన్నారు. తొలివిడతగా దివ్యాంగ, ఆరోగ్య పెన్షన్లపై కన్నేసింద న్నారు. కూటమి వచ్చీ రాగానే కొత్త పంథాకు తెరదీసి, రీవేరిఫికేషన్, రీ అసెస్ మెంట్ పేరిట వికలాంగులంతా మరోసారి వైద్యుల వద్దకు వెళ్లి సదరం సర్టిఫికెట్ చేయించు కోవాలని షరతు పెట్టిందని, వికలాంగత్వం ఎంత ఉందో వైద్యులతో ధృవీకరించి పర్సంటేజీతో సర్టిఫికెట్‌ను తీసుకు రావాలని కొత్త నిబంధనలను ప్రవేశ పెట్టిందన్నారు. దీంతో గత పది,పేదిహేనేళ్లుగా పింఛను తీసుకుంటున్న వికలాంగులు సైతం మళ్లీ సదరం సర్టిఫికెట్లు కోసం దరఖాస్తు చేసుకుని, వైద్య పరీక్షలు చేయించు కున్నారన్నారు. ఇప్పుడు వైకల్యం శాతం 40 కంటే తగ్గిందన్న సాకుతో చాలా మంది పింఛన్లను తొలగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. దివ్యాంగులను మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సింది పోయి, వారి బతుకులతో ఆటలాడుకుంటోందని, వారిపై ఎందుకంత కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారో చెప్పాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఇస్తున్న పింఛను ఇప్పుడు ఎందుకు ఇవ్వరని ఆయన ప్రశ్నించారు.అప్పుడు అర్హులు.. ఇప్పుడు అనర్హులా? అని ఆయన నిలదీశారు. అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి హాయాంలో రూ.200 పింఛను తీసుకున్న వికలాంగులు అప్పుడు అర్హత సాధించి, ఇప్పుడు అర్హత లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పుడు, ఇప్పుడూ రెండు సార్లూ తనిఖీలు చేసింది వైద్యులే కదా, ఇప్పుడు అంగవైకల్యం తగ్గిందని ధృవీకరిస్తున్న ఈ డాక్టర్లది తప్పా.. లేకపోతే అప్పుడు ఇచ్చిన వైద్యులది తప్పా అని ప్రజలే ప్రశ్నిస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి పింఛన్లు తీసుకుంటున్న వికలాంగులను ఒక్కసారిగా అనర్హులుగా ప్రకటించడం న్యాయమా అంటూ ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వం పింఛన్లు సొమ్ము పెంచిది కాబట్టి పింఛనర్ల సంఖ్యను తగ్గించుకోవడానికే పింఛన్లలో కోత విధిస్తోందని ప్రజల నుంచే బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఆరు నెలల కొకసారి కొత్త పెన్షన్లను మంజూరు చేసేవారని ఆయన గుర్తుచేశారు.అదే తరహాలో కూటమి ప్రభుత్వం కొత్త పెన్షన్లను మంజూరు చేయాలని ఆయన కోరారు. **అన్నమయ్య జిల్లాలో 3774 మందికి పెన్షన్లను తొలగించడానికి నోటీసులు జారీ. రాయచోటి నియోజక వర్గంలో 915 మందికి... మండలాల వారీగా**సంబేపల్లె: 118, చిన్నమండెం:65, గాలివీడు:229,



రాయచోటి రూరల్ మండలం: 93, రాయచోటి మున్సిపాలిటీ: 85, లక్కిరెడ్డిపల్లె:133, రామాపురం: 192. వీరిలో పుట్టుక నుంచి వైకల్యంతో బాధపడుతున్న వారు ,మంచానికే పరిమితమైన శారీరక, మానసిక వైకల్యం ఉన్న వారికి, ఎన్నో ఏళ్లుగా పెన్షన్ తీసుకుంటున్నవారున్నారు. వైకల్యశాతం తక్కువ, తాత్కాలిక వైకల్యం కారణంగా పింఛన్ నిలిపివేయనున్నట్లు మండల పరిషత్,మున్సిపల్ కార్యాలయాల నుంచి నోటీసులు అందచేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నోటీసులు అందుకున్న వారు అర్హులుగా భావిస్తే తమ వివరాలను ఎంపిడిఓ, మున్సిపల్ కార్యాలయాలలో అప్పీలు చేసుకోవాలని చేసుకోవడానికి అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. సెప్టెంబర్ మాసం నుంచి వీరికి పెన్షన్లు వచ్చే అవకాశం ఉండదేమోనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల శోకం రాష్ట్రానికి మంచిది కాదన్నారు.సదరం ధ్రువీకరణ పత్రాల కోసం నడవలేనివారిని తరచూ ఆసుపత్రుల చుట్టూ తిప్పడం సమంజసం కాదన్నారు.

స్పౌజ్ పెన్షన్లు కొత్తవి అంటూ ప్రచారం.గత జగన్ ప్రభుత్వంలో పెన్షన్ దారుడు మృతి చెందితే మరుసటి నెలనుంచే అతని భార్యకు (స్పౌజ్) పెన్షన్ మంజూరు అయ్యేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెన్షన్ సైట్ ను క్లోజ్ చేయడంతో ఈ తరహా పెన్షన్లు మంజూరు ఆగిపోయిందన్నారు. 2024 నవంబర్ తర్వాత పెన్షన్ లబ్ధిదారుడు మృతి చెందిన వారికి మాత్రమే స్పౌజ్ పెన్షన్లు ను ఈ ప్రభుత్వం ఇచ్చిందన్నారు.వీటినే కొత్త పెన్షన్లు అన్నట్లుగా కూటమి నాయకులు హడావుడి చేశారన్నారు భర్తను (పెన్షన్ రాని) కోల్పోయి తీవ్ర ఇబ్బందులలో ఉన్న నిరుపేద మహిళలుకు ఒక్కరికీ కూడా సాదారణ వితంతు పెన్షన్లును ఇవ్వక పోవడం దారుణమన్నారు. సంక్షేమ పథకాలు ఇవ్వడం ఒక్క జగన్ ప్రభుత్వానికే సాధ్యమన్నారు.

**పెన్షన్ ల తొలగింపుపై ప్రభుత్వం పునరాలో చించాలి. అర్హులైన ప్రతిఒక్కరికీ పెన్షన్ అందించాలి:** నిరుద్యోగం, ఆర్థిక బాధలు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు , దివ్యాంగులకు పెన్షన్‌లు ఓ శ్వాస వలె ఉన్నా యన్నారు.. ఇప్పుడు వాటిని కూడా తీసేయడమంటే, వారిని రోడ్డున పడేయ డమేనని, మానవ త్వానికి విరుద్ధమని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.


ప్రభుత్వం వెంటనే తుది నిర్ణయం తీసుకుని పెన్షన్‌లను పునరుద్ధ రించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయాలు వేరే పింఛన్లు వేరేనని, అర్హుడికి పింఛన్ ఇవ్వాలన్నదే నిజమైన సంక్షేమమన్నారు. పదేళ్ళు.. పదిహేనేళ్లు.. ఇరవై ఏళ్లుగా పెన్షన్ తీసుకుంటున్న వ్యక్తి ఒక్కరోజులో అనర్హుడవడం వెనుక ఉన్న దురుద్దేశాన్ని ప్రభుత్వమొకసారి పునఃసమీక్షించాలని , దుర్భర జీవితాలు గడుపుతున్న వికలాంగులను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.

## ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తాపై
# దాడిని ఖండించిన గూడూరు కిరణ్ కుమార్

- వైశ్యులకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన
- రాష్ట్ర,దేశ రాజకీయ విజయాలను శాసించే సత్తా ఆర్యవైశ్యులకు ఉంది
- రాష్ట్రంలో,దేశంలో ఆర్యవైశ్యులు దాదాపుగా 18శాతం ఉన్నరు
- వైశ్యులం పోరాటం మాకు కొత్త కాదు
- ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడూరు కిరణ్ కుమార్ ఆవేదన



**నాయుడుపేట –సూర్య వాస్తవం, ఆగస్టు 21:** దేశ రాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా పై జరిగిన దాడిని ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడూరు కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు .వైశ్యులకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి హెూదాలో ఉన్న రేఖ గుప్తా పై దాడి చేయడాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఆర్యవైశ్యులు దాదాపుగా 18శాతం ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర,దేశ రాజకీయ విజయాలను శాసించే సత్తా ఆర్యవైశ్యులకు ఉందన్నారు. ప్రభుత్వాలు మాత్రం ఆర్యవైశ్యులకు సముచిత స్నానం కల్పించడం లేదన్నారు. దేశ రాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆర్యవైశ్య ఆడ పడుచుకు చోటు దక్కిందని సంబరపడే లోపు ఆమెపై దాడి చేయడం, ఆమెకు బెదిరింపులు చేయడంతో ఆర్య వైశ్యులకు దేశంలో రాష్ట్రంలో రక్షణ కరువైందని ఈ ఘటన స్పష్టం చేస్తుందన్నారు.తక్షణమే దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఆమెపై దాడికి ఎవరైనా ప్రేరేపించారా లేక ఏదైనా కుట్ర కోణం ఉందా అన్నది సమగ్ర విచారణ చేసి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ సీఎం రేఖ గుప్తాకు పటిష్ట భద్రతను కల్పించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులకు సరైన రక్షణ సముచిత స్థానం కల్పించాలని కోరారు. లేకపోతే రాష్ట్ర,దేశవ్యాప్తంగా ఆర్య వైశ్యులు తిరుగుబాటు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చ రించారు. శాంతి సహనం అనే నినాదంతో దేశ స్వతంత్రంలో కీలక పాత్ర పోషించిన మహాత్మా గాంధీ, భాషా ప్రయుక్త రాష్ట్రంగా ప్రాణ త్యాగానికి కూడా వెనుకాడక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించి శ్రీ పొట్టి శ్రీరా ములు వారసులం మేమే వైశ్యులం పోరాటం మాకు కొత్త కాదని తెలియ జేశారు.



## సీటీఎం రైల్వే స్టేషన్ వద్ద ఖదీర్‌ను హత్య చేసిన ఇద్దరు అరెస్ట్




**మదనపల్లి –సూర్య వాస్తవం, ఆగస్టు 21:** మదనపల్లె సిటిఎం రైల్వే స్టేషన్ వద్ద ఖదీర్ ను హత్య చేసిన నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కదిరి రైల్వే సిఐ అశోక్ కుమార్ తెలిపిన వివరాలు.. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మండలం, సిటియం రైల్వే బ్రిడ్జ్ వద్ద నాలుగు రోజుల క్రితం వెస్ట్ బెంగాల్ చెందిన ఖదీర్ (30) దారుణ హత్యకు గురికావడం పాఠకులకు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసి, దర్యాప్తు అనంతరం, మదనపల్లె బసినికొండ నవోదయ కాలనీలో ఉండే పఠాన్ ఆసిఫ్ ఖాన్(40) దేవళంవీధిలోని షేక్ మౌళ ను అరెస్ట్ చేశామన్నారు. వీరు ఆర్థిక, వ్యక్తిగత కారణాలతో పాటు గంజాయి అక్రమ రవాణా విషయమై చేతులు కట్టేసి చిత్రహింసలు పెట్టి, కర్రలతో కొట్టి చంపడం జరిగిందన్నారు. అనంతరం మృతదేహాన్ని తీసుకెళ్లి సీఎం రైల్వే స్టేషన్ వద్ద పడేసి వచ్చారన్నారు. ఈ కేసులో ఇద్దర్ని మదనపల్లెలో గురువారం అరెస్టు చేశామని తెలిపారు.

## ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నుంచి నాకు ప్రాణహాని ఉంది
### - ధనుంజయ నాయుడు వెల్లడి



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 21:**ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ నుంచి నాకు ప్రాణహాని ఉందని తాజాగా వెల్లడించారు ధనుంజయ నాయుడు. నన్ను నా ఫ్యామిలీని చంపుతామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఆ ఆడియో కాల్ ఫేక్ అని ప్రెస్ మీట్ పెట్టి చెప్పాలని నాపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపణలు చేశారు ధనుంజయ నాయుడు. ఎమ్మెల్యే దగ్గుబాటి అనుచరుల నుంచి నాకు ప్రాణహాని ఉందన్నారు. పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చిల్లకూరు సుబ్రహ్మణ్యం రెడ్డి(అబ్బయ్య రెడ్డి) కన్నుమూత

### - చిల్లకూరు బాలకృష్ణారెడ్డికి పితృవియోగం

**నాయుడుపేట –సూర్య వాస్తవం, ఆగస్టు 21:** నాయుడుపేట పట్టణానికి చెందిన చిల్లకూరు బాలకృష్ణారెడ్డి తండ్రి చిల్లకూరు సుబ్రహ్మణ్యం రెడ్డి(అబ్బయ్య రెడ్డి) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం,పట్టణానికి చెందిన పలువురు ప్రముఖ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి,శిరసనంబేటీ విజయభాస్కర్ రెడ్డి నాయుడుపేట పట్టణంలోని బి ఏం ఆర్ నగర్‌లో గల బాల కృష్ణారెడ్డి నివాసానికి చేరుకుని అబ్బయ్య రెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనం తరం బాలకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాం క్షించారు. గురువారం సాయంత్రం మూడు గంటలకు బిఎంఆర్ నగర్ లోని నారాయణ స్కూల్ వద్ద గల వారి నివాసం నుండి అబ్బయ్య రెడ్డి అంతిమయాత్ర ప్రారంభమ వుతుందని కుటుంబ సభ్యులు తెలియజేశారు.



## ఇమ్రాన్ ఆత్మహత్యపై పలు అనుమానాలు



**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, ఆగస్టు 21:**అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి మండలంతి మ్మసముద్రం గ్రామంలో ఉద్యాన సహాయకుడిగా పనిచేస్తున్న వల్లూరి ఇమ్రాన్ గురువారంఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఆత్మహత్యపై పలు అనుమానాలుకు తాగిస్తోంది .పనివత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. వృత్తిపట్ల నిబద్ధత, క్రమశిక్షణ కలిగి ఎలాంటి వ్యసనాలు లేని వ్యక్తి ఇమ్రాన్. అతనే ఆ కుటుంబానికి ఆర్థికంగా వెన్నెముక. ఆలాంటి వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం పలు అనుమానాలకు దారి తీస్తోందని కొందరు వాపోతున్నారు.




# ‘విశ్వంభర’ గ్లింప్స్.. ఎలా ఉందంటే?

మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రెస్టీజియస్ మూవీ విశ్వంభర. చిరంజీవి లీడ్ రోల్ పోషిస్తుండగా.. బింబిసార ఫేమ్ వశిష్ట మల్లిడి సోషియో ఫాంటసీ అడ్వెంచర్ కథతో తెరకెక్కిస్తున్నారు. చిరంజీవి సరసన సౌత్ సినీ ఇండస్ట్రీ క్వీన్ త్రిష హీరోయిన్ గా నటిస్తున్నారు. ఆషిక రంగనాథ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ విలన్ రోల్ లో నటిస్తుండగా.. సురభి, ఇషా చావ్లా, రమ్య పసుపులేటి తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు పోషిస్తున్నారు. బీ టౌన్ బ్యూటీ మౌనీ రాయ్ స్పెషల్ సాంగ్ తో సందడి చేయనుండగా.. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న విశ్వంభర షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అయితే ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఆ మూవీ.. ఇప్పుడు వచ్చే ఏడాది సమ్మర్ కు విడుదల కానుంది. ఆ విషయాన్ని చిరంజీవి స్వయంగా అనౌన్స్ చేశారు. ఇప్పుడు ఆయన బర్త్ డే (ఆగస్టు 22) సందర్భంగా గ్లింప్స్ ను గురువారం సాయంత్రం రిలీజ్ చేశారు మేకర్స్. ప్రస్తుతం సోషల్ మీడియాలో గ్లింప్స్ ఫుల్ వైరల్ అవుతోంది. సినీ ప్రియులను తెగ మెప్పిస్తోంది. సినిమాపై అంచనాలు పెంచుతోంది. వీఎఫ్ ఎక్స్ కు అధిక ప్రాధాన్యమిస్తూ మూవీ తెరకెక్కినట్లు గ్లింప్స్ బట్టి అర్థమవుతోంది. అంటూ ఓ పిల్లాడి మాటలతో గ్లింప్స్ ప్రారంభమైంది. ఆ తర్వాత ఒక్కడి స్వార్థం యుద్ధంగా మారి అంతులేని భయాన్నిచ్చింది. అంతకుమించిన మరణశాసనాన్ని రాసింది. కొన ఊపిరితో బతుకున్న ఓ సమూహం తాలూకు నమ్మకం.. అలసిపోని ఆశయానికి ఊపిరి పోసేవాడు ఒకడొస్తాడని.. అంటూ మెగాస్టార్ ను పరిచయం చేశారు. ఆ తర్వాత పిల్లాడు ఎవరినీ అడగ్గా.. చిరును రివీల్ చేశారు. అయితే గ్లింప్స్ లో డైలాగ్ హైలెట్ గా నిలిచింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. మంచి ఇంటెన్స్ తో ఉంది. చిరంజీవి లుక్ తో పాటు యాక్షన్ సీన్స్ అయితే వేరే లెవెల్ లో ఉన్నాయి. ఓవరాల్ గా ట్రైలర్ సూపర్ గా ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే యమలోకం నుంచి బ్రహ్మలోకం వరకు మొత్తం అన్నీ లోకాలు దాటి సత్యలోకానికి హీరో సినిమాలో వస్తారని తెలుస్తోంది. 14 లోకాలకు మూలమైన బ్రహ్మదేవుడి సత్య లోకాన్ని గ్లింప్స్ లో చూపించారు మేకర్స్. ఓవరాల్ గా లోకాల్లో ట్రావెల్ చేసే కాన్సెప్ట్ తో సినిమా ఉండనుందని అర్థమవుతుంది. మరి సినిమా ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# నేటి నుంచి షూటింగ్‌లు



**హైదరాబాద్ బ్యూరో :** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో సినీ కార్మికుల పోరాటం ఫలించింది. వేతన పెంపునకు నిర్మాతలు, కార్మికుల ఫెడరేషన్ మధ్య అంగీకారం కుదిరింది. నేటి నుంచి షూటింగ్‌లు యథాతథంగా కొనసాగనున్నాయి. గురువారం నాడు తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి అసిస్టెంట్ కమిషనర్ గంగాధర్ హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్యాలయంలో ఇదే విషయమై గురువారం రాత్రి పొద్దుపోయే వరకూ సుదీర్ఘ చర్చలు జరిగాయి. తెలుగు సినీ నిర్మాతల మండలి, కార్మికుల పక్షాన ఫిలిం ఫెడరేషన్ తరపున ఐదుగురు చొప్పున ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. అనంతరం తెలంగాణా ఫిలిం ఛాంబర్ కార్యాలయంలో ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు, కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్ సమావేశ వివరాలను వెల్లడించారు. 22.5 శాతం వేతన పెంపునకు ఇరుపక్షాలు అంగీకరించినట్లు తెలిపారు. రూ.2 వేలలోపు వేతనాలు ఉన్న వారికి తొలి ఏడాది 15 శాతం, రెండో ఏడాది 2.5 శాతం, మూడో ఏడాది 5 శాతం, రూ.2 వేల నుంచి రూ.5 వేలు ఉన్నవారికి తొలి ఏడాది 7.5 శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం పెంచనున్నారు. పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత ప్రిన్సిపల్ సెక్రటరీ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వేతనాలను 30 శాతం మేర పెంచాలని కోరుతూ ఈ నెల 4 నుంచి సినీ కార్మికులు సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. సిఐటియు ఈ పోరాటానికి మద్దతు ప్రకటించింది. పోరాటం ఫలించడంతో కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.





# బ్రోంకో టెస్ట్ పాసవ్వాల్సిందే..



**బెంగళూరు:** క్రికెటర్లు ఇంతకుముందు యో-యో టెస్టుల్లో పాసవ్వాల్సి ఉండగా.. తాజాగా బ్రోంకో టెస్టుల్లో తప్పనిసరిగా పాసవ్వాల్సిందేనని నిబంధనలు విధించింది. రగ్బీ కేంద్రంగా పనిచేసే బ్రోంకో టెస్టుల్లో క్రికెటర్లు తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందని పేర్కొనడంతో ఆటగాళ్లు ప్రస్తుతం మైదానంలో చెమటోడ్చుతున్నారు. మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్‌గా ఉన్నప్పుడు యో-యో టెస్ట్ సంస్కృతి ఉండగా.. ఆ తర్వాత విరాట్ కోహ్లి బాధ్యతలు స్వీకరించేనాటికి ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి నిబంధన వచ్చింది. తాజాగా బ్రోంకో టెస్ట్‌ల ద్వారా తమ ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాలని దీంతో ఆటగాళ్లు మరింత ఫిట్‌గా ఉండేందుకు దోహదపడుతుందని తెలిసింది. దీని కారణంగా ఆటగాళ్లు అదనపు పరుగులు రాబట్టడం, వేగంగా సింగిల్స్ తీయడం, ప్రత్యర్థి ఆటగాళ్లను రనౌట్ చేయడానికి కూడా దోహదపడుతుందని వారి భావన. ప్రస్తుతం టీమిండియా ఆటగాళ్ల ఫిట్‌నెస్ నిరూపించుకునే పద్ధతిలో మార్పు వచ్చింది. రాబోయే రోజుల్లో టీమిండియా క్రికెటర్లు బ్రోంకో ఫిట్‌నెస్ పరీక్షలో తప్పనిసరిగా పాసవ్వాల్సి ఉంటుంది. ఇది ఏమిటి ఎలా ఉంటుంది అనేది బిసిసిఐ స్పష్టం చేయకున్నా.. యో-యో టెస్టులకు భిన్నంగా ఉంటుందని సమాచారం. ఈ టెస్ట్‌ను టీమిండియా ప్రధాన కోచ్ గౌతం గంభీర్, కండీషనింగ్ కోచ్ అడ్రియన్ లె రౌక్స్ కొత్తగా తీసుకువచినట్లు తెలిసింది. ఇది తొలుత రగ్బీ ఆటగాళ్ల కోసం ప్రవేశపెట్టబడింది. దీన్ని ఏరోబిక్ టెస్ట్‌తో కొలుస్తారు. దీని కారణంగా ఆటగాళ్ల గుండె వేగంగా కొట్టుకోవడం జరుగుతుంది. బ్రోంకో టెస్ట్ యో-యో పరీక్ష మాదిరిగా 2కిలోమీటర్ల టైమ్ ట్రయల్‌ను కలిగి ఉండదు.

**బ్రోంకో టెస్ట్ అంటే ఏమిటి..?:** బ్రోంకో పరీక్ష అనేది ఏరోబిక్ రన్నింగ్ డ్రిల్. ఇందులో 20, 40 మరియు 60మీటర్ల షటిల్ పరుగు ఉంటుంది. ఆటగాళ్లు తొలుత 20మీటర్ల షటిల్‌ను పూర్తి చేయాలి. తిరిగి వచ్చేటప్పుడు 40మీటర్ల షటిల్ పరుగెత్తాలి. ఈ నియమం ప్రకారం ప్రతి ఆటగాడు రెండు షటిల్ పరుగుల కోసం సుమారు 80మీటర్లు లేదా 120 మీటర్లు పరుగును పూర్తి చేయాల్సి ఉంటుంది. అలా మూడుసార్లు కలిపి ఒక సెట్ అంటారు. బ్రోంకో టెస్ట్‌లో ఒక ఆటగాడు విశ్రాంతి తీసుకోకుండా ఐదు సెట్‌లను పూర్తి చేయాల్సి ఉంటుంది. అంటే ఒక్కో ఆటగాడు కనీసం 1200మీటర్ల పరుగును కవర్ చేయాల్సి ఉంటుంది. ఐదు సెట్‌లను పూర్తి చేసే సమయానికి పట్టే సమయాన్ని ఆటగాడి ఫిట్‌నెస్ కొలమానంగా గుర్తిస్తారు. అలాగే ఆరు నిమిషాల బెంచ్ మార్క్ సమయం 17.1గా నిర్ణయించబడింది. అదే సమయంలో 2కి.మీ. టైమ్ ట్రయల్‌ను బట్టి వేర్వేరు సమయ పరిమితులను నిర్దేశిస్తుంది. ఫాస్ట్ బౌలర్లు దానిని 8 నిమిషాల 15సెకన్లలో పూర్తి చేయాల్సి ఉండగా.. ఇతర ఆటగాళ్లకు అదనంగా 15 సెకన్ల ఇవ్వడం జరుగుతుంది. బెంగళూరులోని బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చాలామంది ఆటగాళ్లు ఇప్పటికే బ్రోంకో టెస్ట్‌లో ఉత్తీర్ణులైనట్లు, ఈ టెస్ట్‌లు ఎక్కువగా పేసర్లకు ఉపయోగకరమని తెలుస్తోంది. ఆ తర్వాత జిమ్‌లలో ఆటగాళ్లు ఎక్కువ సమయం గడపాల్సి ఉంటుంది. ఈ ఏడాది జూన్‌లో కోచ్ మరియు కండీషనింగ్ కోచ్ ఈ టెస్టులను క్రికెటర్లకు అమలు చేయాలని సూచించడం జరిగింది. జనవరి 2002 మరియు మే 2003 వరకు అప్పటి కెప్టెన్ సౌరవ్ గంగూలీ మరియు ప్రధాన కోచ్ జాన్ రైట్ ఆధ్వర్యంలో ఇది తొలుత అమలు చేశారు.

## విజయవాడ సన్‌షైనర్స్‌పై

# భీమవరం బుల్స్ విజయం

**ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం) :** ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ -4లో భాగంగా గురువారం మధ్యాహ్నం ఎసిఎ - విడిసిఎ మైదానంలో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో విజయవాడ సన్ షైనర్స్‌పై భీమవరం బుల్స్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ సన్ షైనర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. భీమవరం బుల్స్ జట్టు 19.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసి విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ విజయవాడ సన్ షైనర్స్ జట్టు బ్యాటర్ ఎం.అభినవ్ 42 బంతులలో ఒక సిక్స్ ఆరు ఫోర్లతో 54 పరుగులు చేయగా, మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ఎం.ధీరజ్ కుమార్ 26 బంతులలో ఐదు సిక్సులు, మూడు ఫోర్లతో 51 పరుగులు చేశాడు. భీమవరం బుల్స్ బౌలర్లలో చల్లారపు శివ 3 ఓవర్లలో 36 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీయగా, ఎం.హేమంత్ రెడ్డి 2 వికెట్లు సత్యనారాయణ రాజు, హరి శంకర్ రెడ్డి ఒక్కొక్క వికెట్టు తీశారు. 161 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన భీమవరం బుల్స్ బ్యాటర్లలో జట్టు కెప్టెన్ హేమంత్ రెడ్డి 43 బంతులలో ఆరు సిక్సులు, మూడు ఫోర్లతో 71 పరుగులు, ఓపెనర్ నిమ్మల హిమకర్ 39 బంతులలో రెండు సిక్స్‌లు, నాలుగు ఫోర్లతో 43 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. విజయవాడ సన్ షైనర్స్ జట్టు బౌలర్లలో జి.సాయి వెంకట సుమిత్ 3.3 ఓవర్లలో 21 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీయగా, ఎర్ర పృథ్వీరాజ్ 3 ఓవర్లలో 11 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశారు. ఈ మ్యాచ్ లో అద్భుతంగా రాణించి 71 పరగులు చేయటంతో పాటు బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన భీమవరం బుల్స్ జట్టు కెప్టెన్ ఎం.హేమంత్‌రెడ్డి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు.



# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహిద్దాం

## - ఎమ్మెల్యే కందికుంట



**కదిరి –సూర్య వాస్తవం, ఆగస్టు 21:** ప్రతి ఏటా నిర్వహిస్తున్న వంటి వినాయక చవితి పండుగ ఉత్సవాలనే ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు ఇవ్వకూడదని, భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలను జరుపుకోవాలని కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పిలుపు నిచ్చారు, గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాల యంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మతసామరస్యంగా కదిరి ప్రజలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నటువంటి పండుగ లో భాగంగా కులమతాలకు అతీతంగా ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు మండపాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేశారు, అలాగే నిమజ్జనం రోజు సరైన సమయానికి విగ్రహాలను శాంతి యుత వాతావరణంలో ఊరేగింపు జరుపు కోవడానికి ప్రభుత్వ అధికారులు, పోలీసు యంత్రాంగం, అన్ని సహాయ సహకారాలను అందజేయడం జరిగిందని తెలిపారు, అంతేకాకుండా విద్యుత్ అంతరాయం కలగ కుండా ప్రభుత్వం దాదాపు నాలుగు కోట్ల పైచిలుకు రూపాయలను వెచ్చించిందని.. విద్యుత్ కాంతులతో ఊరేగింపుకు అన్ని సదుపాయాలు కల్పించామని



తెలిపారు, మున్సిపల్ అధికారులు తమ వంతు సహాయ సహకారాలను అందజేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు, పోలీస్ అధికారుల కు గతంలో చలానా పేరుతో కొంత సొమ్మును చెల్లించవలసి వచ్చేది అయితే ఈ సంవత్సరం మండప , నిర్వాహకులకు ఒక రూపాయి చలానాకూడా లేకుండా వెసులుబాటు కల్పించారు, ముస్లిం మత పెద్దలకు ప్రత్యేకంగా విగ్రహాల ఊరేగిం పులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో కదిరి ఆర్డిఓ సన్యాసిరావు శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, డి.ఎస్.పి శివ నారాయణ, విద్యుత్ అధికారులు ఓబులేసు, టిడిపి నాయకులు బహవుద్దీన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భైరవ ప్రసాద్ , బిజెపి నాయకులు నాగేంద్రప్రసాద్, ముస్లిం మత పెద్దలు మౌలానా, సీఐ నారాయణరెడ్డి, సీఐ నాగేంద్ర, ఎస్సై బాబ్జాన్, విగ్రహ నిర్వాహకులు, ప్రజా సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల నిర్వహణకు

# అనుమతులు తప్పనిసరి .....

### - జిల్లాలో గణేష్ ఉత్సవాలు

### సురక్షితంగా నిర్వహించడమే లక్ష్యం :జిల్లా ఎస్పీ పి.జగదీష్



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 21:** జిల్లాలో వినాయక ఉత్సవాల అనుమతుల కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా ganeshut-sav.net అనే వెబ్సైట్ను ప్రారంభించిందని... సదరు వెబ్సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్లైన్లో అనుమతులు పొందాలని వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులకు జిల్లా ఎస్పీ పి.జగదీష్ సూచించారు. ఈ అనుమతులు పొందడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీ నిర్వాహకులు ganeshutsav.net వెబ్సైట్ సేవలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, సంబంధిత పోలీస్ అధికారి మంటప స్థలాన్ని తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం ఉంటే కోడ్తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు మాత్రమే ఈ అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం..

**ఆదోని – సూర్య వాస్తవం, ఆగస్టు 21:** శుక్రవారం నాడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డి 3 ఏఈ ఉల్లిగప్ప తెలిపారు. విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని హనుమాన్ నగర్, రాజరాజేశ్వరి నగర్,



చాకలిగేరి , చౌదరి బావి, నిజాముద్దీన్ కాలనీ, వద్దే గేరి, కి లిచిన పేట ఈ ప్రాంతాలలో మధ్యాహ్నం 12 నుండి అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమ సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.

## వెనుకబడిన ప్రాంతాల్లో

# అభివృద్ధి కోసం కృషి చేయండి

## - జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్




**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం ,ఆగస్టు 21:** అన్నమయ్య జిల్లా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నీతి అయోగ్ సంస్థ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల్లో విశేష ఫలితాలు సాధించామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో జరిగిన సంపూర్ణత అభియాన్ సమన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ, నీతి అయోగ్ సూచించిన పారామీటర్లలోని ఆరు పారామీటర్లలో లక్కిరెడ్డిపల్లి, కోడూరు, కురుమలకోట మండలాల్లో అధికారులు సమర్థవంతంగా పనిచేసి అభివృద్ధి సాధించారన్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్, హైపర్టెన్షన్, పోషకాహార పదార్థాల పంపిణీ, సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ, డ్వాక్రా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ వంటి కీలక అంశాల్లో మూడు నెలల వ్యవధిలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా కురు మలకోట మండలం ఆరు పారామీటర్లలో లక్ష్యాలు సాధించి బంగారు పతకాన్ని, కోడూరు మండలం ఐదు పారా మీటర్లలో విజయాలు సాధించి వెండి పతకాన్ని, లక్కిరెడ్డిపల్లి మండలం నాలుగు పారామీటర్లలో లక్ష్యాలు సాధించి కాంస్య పతకాన్ని అందుకున్నట్లు జెసి వెల్లడించారు. వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోసం అధికారులు మరింత కృషి చేసి ప్రజలకు లబ్ధి చేకూరేలా పనిచేయాలని ఆయన సూచించారు. అంతకుముందు కలెక్టరేట్ ఆవరణలో చేతివృత్తుల మహిళలు తయారుచేసిన వస్తు ప్రదర్శనల స్టాల్ ను జాయింట్ కలెక్టర్ ప్రారంభించి సంబంధిత వస్తువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో సిపిఓ సి పెద్దయ్య, డిఆర్డిఏ పిడి సత్యనారాయణ, ఐసిడిఎస్ పిడి హైమావతి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బుద్ధినికొండలో ఎలాంటి కార్యక్రమాలకు అనుమతి లేదు



మదనపల్లె **సూర్య వాస్తవం, ఆగస్టు 21:** బుద్ధుని కొండలో 23వ తేదీన ఎలాంటి కార్యక్రమాలకు తాము అనుమతి ఇవ్వలేదని తహశీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి, సిఐ కళా వెంకట్రమణ లు తెలిపారు. అంకి శెట్టిపల్లి పంచాయతీ, నల్లగుట్టలో మదనపల్లె కి చెందిన బాస్ నేతలు బుద్ధిని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని, బుద్ధుని కొండ అని నామకరణం చేసుకున్నారని, అయితే అక్కడ నెలన్నర క్రితం బుద్ధిని తల ధ్వంసం కావడంతో దానిపై కేసు నమోదు చేసి కేసును కూడా ఛేదించడం జరిగిందన్నారు. అయితే బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేసిన నిర్వాహకులు దీనిపైన అతిగా స్పందించి నిరసనలు, దీక్షలు చేపట్టారని, 23న బుద్ధిని నూతన విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టిస్తామని సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేశారన్నారు. అయితే ఆ ప్రదేశం ప్రభుత్వ స్థలం కావున అక్కడ ఎవరికీ ఎలాంటి అనుమతులు లేవని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## దివ్యాంగులపై కూటమి

# కరుణ లేకపోవడంపై ఆగ్రహం

### - సత్యనారాయణ రెడ్డి

### మండలంలో 261 మందికి పింఛన్ రద్దు నోటీసులు

### నడవలేని వారికీ అనర్హత ముద్ర : కామిరెడ్డి



**పెళ్ళకూరు, సూర్యా వాస్తవం, ఆగస్టు 21:**మండల వ్యాప్తంగా దివ్యాంగులు గగ్గోలు పెడుతున్నారు. పింఛన్లు నిలిపివేయడం, అనర్హత పేరుతో నోటీసులు ఇవ్వడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నాడు వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. "ప్రజలకే కాదు దివ్యాంగుల పట్ల కూడా కూటమి ప్రభుత్వానికి కనికరం లేదు. మంచానికే పరిమితమైన వారికి సైతం పింఛన్ రద్దు నోటీసులు ఇవ్వడం అత్యంత దారుణం. ఇది దివ్యాంగుల నోటి కాడను లాగేసినట్టే" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మరింతగా మాట్లాడుతూ, సరికొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి దివ్యాంగుల పింఛన్లలో కోత విధించి ఇబ్బంది పెడుతున్నారని, దివ్యాంగులపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. మండలంలోనే 261 మందికి అనర్హత పేరుతో పింఛన్లు రద్దు చేయడం దివ్యాంగుల జీవితాలను వారి యొక్క మనోభావాలను దెబ్బతీసిందని తెలిపారు. "ఇప్పటికైనా ప్రభుత్వం హృదయపూర్వకంగా ఆలోచించి రద్దు చేసిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలి" అని కామిరెడ్డి డిమాండ్ చేశారు.

# సాగర్ మాల రోడ్డు పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

### - సాగర్ మాల రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన రైతులు

### - రైతులకు చెల్లించాల్సిన భూ పరిహారం ఇప్పించేలా చూడాలని ఆర్డీవో కిరణ్మయి, తహశీల్దార్ రాజేంద్రకి ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్

**నాయుడుపేట –సూర్య వాస్తవం, ఆగస్టు 21:** తిరుపతి జిల్లా నాయుడుపేట సాగరమాల రోడ్డు పనులను గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతులు నాయుడుపేట ప్రాంతంలో సాగర్ మాల రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలియజేశారు.

అలాగే రైతులకు చెల్లించాల్సిన భూ పరిహారం ఇప్పించేలా చూడాలని సూళ్లూరుపేటఆర్డీవో కిరణ్మయి, నాయుడుపేట తాసిల్దార్ రాజేంద్ర కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎం హెచ్ పి డి చౌదరి,రైతులు సన్నారెడ్డి హరినాద్ రెడ్డి,కామిరెడ్డి విజయసారధి రెడ్డి,కామిరెడ్డి మధుసూదన్ రెడ్డి,నల్లారెడ్డి మధుసూదన్ రెడ్డి,ఎం భాస్కర్,కె. సురేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.




## సమగ్ర యాజమాన్యం

# రైతు భవిష్యత్తు మార్చబోతుంది

### - సేంద్రియ ఎరువులతోనే

### లాభాల పెరుగుదల - వ్యవసాయ అధికారులు




**ఓజిలి, సూర్యా వాస్తవం ఆగస్టు 21:** రైతు ఆదాయం పెంచే దారిలో సమగ్ర యాజమాన్యం కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు స్పష్టం చేశారు. గురువారం ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామంలో పీఎం–ఆర్‌కేవై పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు శిక్షణా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సాగులో సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్టె ఎరువులు, జనుము జీలుగ, జీవన ఎరువులు వాడితే రసాయన ఎరువులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని చెప్పారు.?? "ఇలా సాగు చేస్తే నేలకు సారం, భూమికి ఆరోగ్యం వస్తాయి. రైతులకు ఖర్చు తగ్గడమే కాకుండా ఆహార భద్రతతో పాటు ఆదాయం కూడా పెరుగుతుంది," అని వేణుగోపాలరావు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు దనదీప్, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవిప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )